ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు జిల్లా వార్తలు
5
బుధవారం 31 జనవరి 2024



మళ్లీ అంతేనా !



ఒకప్పుడు సహకార సొసైటీలే పల్లెలకు ప్రాణం. రైతులకు, రైతువారీ కుటుంబాలకు కొండంత అండ. వ్యవసాయ అవసరాలకు, కష్టం వస్తే వ్యక్తిగత రుణాలకు అండగా ఉండే ఈ వ్యవస్థ జగన్ పాలనా పగ్గాలు చేపట్టిన తరువాత పూర్తిగా సొమ్మసిల్లింది. నష్టాల్లో కూరుకుపోయింది. సకాలంలో ఎన్నికలకు నోచుకోలేని దుస్థితి. ఈ ఐదేళ్లలో ఎన్నికలు నిర్వహించడం చేతకాక, ఆ దిశగా అడుగులు వేయలేక సంఘాలన్నింటికీ ప్రతీ ఆరు నెలలకోసారి నామినేటెడ్‌తో సరిపెట్టారు. తాజాగా జిల్లా సహకార కేంద్ర బ్యాంక్(డీసీసీబీ), దీని పరిధిలో వున్న సొసైటీల పదవీ కాలం నేటితో ముగియనుంది. మళ్ళీ ఇప్పుడు గతం మాదిరిగానే మరో ఆరు నెలలంటారా ? ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ ఏ నిర్ణయం తీసుకుంటారో చూడాలి !

- నేటితో తీరనున్న సొసైటీ త్రిసభ్య కమిటీల పదవీ కాలం
- గడిచిన ఐదేళ్లుగా సొసైటీలంతా నామినేటెడే
- ఎన్నికల ఊసే ఎత్తని జగన్ సర్కార్
- అన్ని సొసైటీల్లోను తమ పార్టీ ముద్ర ఉన్నవారికే చోటు
- డీసీజీబీ చైర్మన్ విషయంలోను ఇదే ధోరణి
- ఈసారి ఏం చేయబోతున్నారన్నదే ఉత్కంఠ

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

ఒకప్పుడు రైతువారీ అవసరాలకు ఆయువు పట్టు సొసైటీలు. వీటి ద్వారానే రైతుల అవసరాలకు అనుగుణంగా పరపతి దక్కేది. సకాలంలో రుణం అందేది. స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలుగా విభజించి ఆ మేరకు లక్ష్యాలు విధించి రైతులకు దన్నుగా నిలబడేవి. రానురాను పరిస్థితి మారుతూ వచ్చింది. సహకార సంఘాల్లో రాజకీయ జోక్యం పెరిగింది. పదేళ్ళ క్రితం 2013-14లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం సహకార సంఘాలకు కాస్తంత జీవం పోసింది. స్థానిక సంస్థలకు తోడుగా సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించింది. నువ్వా నేనా అన్నట్టుగా సాగిన ఆ ఎన్నికల్లో టీడీపీదే పైచేయి అయ్యింది. ఆ తరువాత 2019 సాధారణ ఎన్నికల్లో టీడీపీ ఓటమి చెంది, అధికార పగ్గాలు చేజిక్కించుకున్న వైసీపీ సహకార సంఘాలకు దాదాపు పొగ పెట్టింది. ఓ వైపు ఎన్నికలు నిర్వహించకపోగా ఇష్టానుసారం కీలక నిర్ణయాలు తీసుకుంటూ వచ్చింది. సొసైటీల్లో వున్న లాభనష్టాలను బేరీజు వేసుకుని ఆ తరువాత సిబ్బంది తగ్గింపు, నిర్వహణ వ్యయం తొలగింపు వంటి అనేక దుందుడుకు చర్యలను తీసుకుంది. దీనికితోడు ఎన్నికల మాట మరిచి.. సంఘాలన్నింటికీ తమ పార్టీ అనుకూలురైన వారితో త్రిసభ్య కమిటీలను నియమించింది. రైతులు నేరుగా ఎన్నుకుంటే పక్షపాతరహితంగా ఉండే సొసైటీ పాలకవర్గాలను కాదనుకుని తమ పార్టీ ముద్ర వున్న ముగ్గురితో త్రిసభ్య కమిటీలను ఏర్పాటుచేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తొలినాళ్ళల్లో డీసీసీబీ చైర్మన్‌గా కౌరు శ్రీనివాస్‌ను నియమించింది. కొన్నాళ్ళకే ఆయన స్థానంలో వైసీపీ సీనియర్ నేత పీవీఎల్ నరసింహరాజును చైర్మన్‌గా నియమించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సుమారు 258కి పైగానే సహకార సంఘాలు ఉన్నాయి. డీసీసీబీ పాలక మండలితోపాటు సొసైటీలు 2021 నుంచి నేరుగా నామినేట్ చేస్తూ పోయారు. ప్రతీ ఆరు నెలలకోసారి ఆయా కమిటీల్లోనే కొంత మార్పులు, చేర్పులు చేసి మళ్ళీ ఆ కమిటీలనే కొనసాగిస్తూ వస్తున్నారు. దీంతో వైసీపీ అనుకూలురే పెత్తనం చేస్తూ వస్తున్నారు. దీనికితోడు రాజకీయ పునరావాస కేంద్రాలుగా సొసైటీలు మారాయి. ఈ క్రమంలోనే ఉండి నియోజకవర్గ వైసీపీ కన్వీనర్‌గా ఉన్న పి.వి.ఎల్‌ను దఫదఫాల వారీగా డీసీసీబీ చైర్మన్ హోదాలోనే కొనసాగిస్తున్నారు.

ఈ ఐదేళ్లల్లో పేరుకుపోయిన అవినీతి

గడిచిన ఐదేళ్ళల్లో కొన్ని సొసైటీలలో అనేక అక్రమాలు బయటపడ్డాయి. కొన్నింటికేమో మసిపూసి మారేడు చేశారు. మరికొన్నింటికేమో పాలక మండళ్ళను బాధ్యులను చేయకుండా అధికారులపైనే పెట్టేశారు. గతంలో జరిగిన అవినీతిపైన విచారణకు ఆదేశించినా ఏవీ ఒక కొలిక్కిరాలేదు. దీంతో సహకార సంఘాల్లో ఎలాంటి అవకతవకలు జరిగినా, నిబంధనలకు విరుద్ధంగా నిధులు దారిమళ్ళినా నిక్కచ్చిగా విచారణకు అవకాశం లేకుండా పోయింది. ఈ మధ్యన రెండు, మూడు సొసైటీల్లో పెద్దఎత్తున అవకతవకలు జరిగినట్టు ఆరోపణలు వచ్చాయి. సహకార శాఖ ఇలాంటి తరుణంలో తక్షణం అధికారులను రంగంలోకి దింపడం, ఆ తరువాత సుదీర్ఘ విచారణకు సమాయత్తం కావడం ఎప్పుడు జరిగేదే. దీంతో సహకార వ్యవస్థకు బీటలు వారింది.

పాత కథేనా

గతంలో మాదిరిగానే గడువు తీరిన డీసీసీబీ, సొసైటీల కమిటీల నామినేటెడ్ వ్యవహారం ఉంటుందా, లేదా అనేది మంగళవారం వరకు తేలలేదు. వాస్తవానికి ఎన్నికలకు ముందు నామినేట్ వ్యవహారం సాధ్యంకాదని అధికార వర్గాలు చెబుతున్నాయి. దీంతో పర్సన్ ఇన్‌చార్జ్‌లనే నియమించాల్సి ఉంది. ఆది నుంచి తమకైన వారిని త్రిసభ్య కమిటీలు వేస్తూ వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఇప్పుడు అదే పరిస్థితిని కొనసాగించడానికే సుముఖంగా ఉన్నట్టు చెబుతున్నారు. ఇంతకుముందు పార్టీలో నిత్యం శ్రమించిన నల్లజర్ల మండలానికి చెందిన కారుమంచి రమేష్ డిసిసిబి చైర్మన్ పదవిని ఆశించారు. అప్పట్లో గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆ మేరకు సిఫార్సు లేఖ ఇచ్చారు. రమేష్‌ను కాదని పి.వి.ఎల్ వైపే మొగ్గు చూపింది. రమేష్ కేవలం ఒక బలమైన సామాజిక వర్గానికి చెందిన వాడు కావడంతోనే ఆ పదవి చేజారిందనే వాదనలు పార్టీలో వినిపించాయి. ఈసారి ఒకవేళ డీసీసీబీ నామినేటెడ్‌లో రమేష్‌కు అవకాశం వస్తుందా లేదా అనే చర్చ జరుగుతూనే ఉంది. ఇప్పటికే ఎమ్మెల్యే, ఎంపీ టికెట్ల రచ్చలో ఉన్న పార్టీ నాయకత్వం ఇప్పటిదాకా ఈ వైపు దృష్టి పెట్టనే లేదు. ప్రత్యేకించి బుధ లేదా గురువారాల్లో సొసైటీలను మరో ఆరు నెలలపాటు కొనసాగించేందుకు వీలుగా ఉత్తర్వులు వెలువడతాయని మరికొంతమంది భావిస్తున్నారు.



సొమ్ము సొసైటీలది.. సోకు డీసీసీబీది

ప్రభుత్వ వైఖరితో నష్టపోతున్న సహకార సంఘాలు

ధాన్యం కమీషన్ డీసీసీబీలో డిపాజిట్

పెదవి విప్పని పాలకవర్గాలు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

ధాన్యం కమీషన్ మంజూరులో ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరితో సహకార సంఘాలు నష్టపోతున్నాయి. ఈ సంఘాల ద్వారా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తోంది. ప్రతి క్వింటా ధాన్యానికి రూ.31.25 కమీషన్ రూపంలో సహకార సంఘాలకు చెల్లిస్తోంది. అందులో 20 శాతం మాత్రమే సొసైటీలు ఖర్చు పెట్టుకోవడానికి వెసులుబాటు కల్పించారు. మిగిలిన 80 శాతం కమీషన్‌ను జిల్లా సహకార బ్యాంకు(డీసీసీబీ)లో డిపాజిట్ చేస్తున్నారు. ఆ సొమ్ముకు డీసీసీబీ సొసైటీలకు 8.5 శాతం వడ్డీని చెల్లిస్తోంది. ధాన్యం కొనుగోలులో కష్టపడి రైతులకు సేవలు అందిస్తుంటే కమీషన్ సొమ్మును జిల్లా సహకార బ్యాంకులో జమ చేయడాన్ని సహకార సంఘాల సిబ్బంది తప్పు పడుతున్నారు. ఇప్పటివరకు జిల్లా సహకార బ్యాంకులో సొసైటీలకు సంబంధించి దాదాపు రూ.100 కోట్లు డిపాజిట్ చేశారు. అదే సొసైటీ ఖాతాల్లో జమ అయితే అధిక శాతం వడ్డీ వచ్చేది. ఎరువుల వ్యాపారాలు కూడా చేసుకునేవి. అధిక వడ్డీ లభించేది. అందుకు భిన్నంగా డీసీసీబీలో డిపాజిట్ చేయడంతో సొసైటీలు నష్టపోతున్నాయి. డీసీసీబీ చెల్లించే వడ్డీతోనే సరిపెట్టుకుంటున్నాయి.

ఎదురు పెట్టుబడి

ధాన్యం కొనుగోలులో సహకార సంఘాలు ఎదురు పెట్టుబడి చేస్తున్నాయి. ప్రభుత్వం సకాలంలో కమీషన్ విడుదల చేయకపోవడంతో సిబ్బంది వేతనాలకు సొంత సొమ్ములను వెచ్చిస్తున్నాయి. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో అవసరమైన పరికరాలు కొనుగోలు చేస్తున్నాయి. ప్రభుత్వం ముందస్తుగా పెట్టుబడి సొమ్ములను చెల్లించేది. ఇటీవల అడ్వాన్స్‌లు చెల్లించడాన్ని నిలిపివేసింది. సొసైటీలపై భారం వేయకుండా కాంట్రాక్టు పద్ధతిలో సిబ్బందిని నియమించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అయితే ఏజన్సీలు ముందుకు రాలేదు. దీంతో సొసైటీలే సిబ్బందిని నియమించుకున్నాయి. ప్రతి రైతు భరోసా కేంద్రంలోనూ ముగ్గురి సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి నెలా వారికి సుమారు రూ.45 వేల వేతనాన్ని చెల్లిస్తున్నారు. ఇలా సొసైటీలు ఎదురుపెట్టుబడి పెట్టాల్సి వస్తోంది.

సహకార సంఘాల్లో జమయితే ..

ధాన్యం కమీషన్‌ను సహకార సంఘాల్లో జమచేస్తే రైతులకు రుణాలు ఇవ్వడానికి వెసులుబాటు ఉంటుంది. ప్రతిఏటా 11.5 శాతం వడ్డీ లభిస్తుంది. అదే వాణిజ్య రుణాలైతే 13.5 శాతం వడ్డీ సమకూరుతుంది. మరోవైపు ఎరువుల విక్రయాలు నిర్వహించుకునే అవకాశం కలుగుతుంది. ఇదే విషయమై జిల్లాలోని పలు సహకార సంఘాలకు అధికారులకు లేఖలు రాశాయి. కమీషన్ సొమ్మును పూర్తిస్థాయిలో ఇప్పిస్తే వ్యాపారాలు విస్తరిస్తామంటూ విజ్ఞప్తి చేశాయి. అయినా అధికారులు స్పందించలేదు. డీసీసీబీ ఖాతాలోనే జమ చేస్తున్నారు.

రబీ బకాయిలపై స్పందించని ప్రభుత్వం

గడచిన రబీకి సంబంధించిన బకాయిలను ఇప్పటి వరకు ప్రభుత్వం చెల్లించలేదు. ఒక్క పశ్చిమ గోదావరి జిల్లా వరకే రూ.10 కోట్లు విడుదల చేశారు. ఆ మొత్తం ఇప్పటికీ సొసైటీలకు జమ కాలేదు. వాటికోసం సహకార సంఘాలు ఎదురుచూస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం సొసైటీ ఖాతాల్లోనే జమ చేయాలని ఆదేశాలు జారీచేసింది. అదే జరిగితే పూర్తిస్థాయిలో సొసైటీలు కమీషన్ సొమ్మును వినియోగించుకునే ఆస్కారం ఉంటుంది. కమీషన్ సొమ్ముతో రైతులకు అవసరమైన ఉపకరణాలను కొనుగోలు చేయాలని అధికారులు సూచించారు. సంచులు కొనుగోలు చేయాలని ప్రతిపాదించారు. సదరు ప్రతిపాదనలను సొసైటీలు అంగీకరించలేదు. దాంతో ప్రభుత్వం విడుదల చేసిన బకాయిలు సొసైటీలకు జమ కాలేదు. గతంలో డీసీసీబీ ఖాతాలో డిపాజిట్ చేసిన సొమ్ములపైనా ప్రభుత్వం పెదవి విప్పడం లేదు. దాంతో సొసైటీలకు నష్టం వాటిల్లుతోంది.

ప్రేక్షక పాత్రలో పాలక వర్గాలు

వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సొసైటీలకు ఎన్నికలు నిర్వహించడం లేదు. నామినేషన్ పద్ధతిలో పాలకవర్గాలను నియమిస్తోంది. త్రిసభ్య కమిటీల ద్వారా సహకార సంఘాలను నిర్వహిస్తున్నారు. అధికార పార్టీ శ్రేణులతో కమిటీలను భర్తీ చేస్తున్నారు. దాంతో ప్రభుత్వంపై కమిటీలు పెదవి విప్పడం లేదు. కమీషన్ సొమ్మును విడుదల చేయకపోయినా సరే ప్రశ్నించలేకపోతున్నాయి. రైతులకు సేవలందించడంలో విఫలమవుతున్నాయి. ప్రభుత్వ నిర్ణయానికి వత్తాసు పలుకుతున్నాయి.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తణుకు మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి

బకాసురిడిలా మింగేశారు

మంత్రి కారుమూరి అవినీతిపై మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి ఫైర్

తణుకు, జనవరి 30: 'అబద్ధానికి బ్రాండ్ అంబాసిడర్‌గా మారిన మంత్రి కారుమూరి నాగేశ్వరరావు నియోజకవర్గాన్ని బకాసురుడు మాదిరి దోచుకున్నారు. ఆయన హయాంలో తణుకు నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి ఎంతో.. అవినీతి ఎంతో అందరికీ తెలుసు. వీటిపై బహిరంగ చర్చకు సిద్ధమే' అని తణుకు మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ స్పష్టం చేశారు. ఓటమికి దగ్గరలో ఉండటం వల్ల అసహనంతో అబద్ధాలు వల్లె వేస్తున్నారు. సిగ్గు లేకుండా ప్రతిపక్షాలపై ఎదురుదాడి చేస్తున్నారని మండిపడ్డారు. మంత్రి టీడీఆర్ బాండ్లలో వందల కోట్లు దోచుకున్నారు. ఇళ్ళ స్థలాల కొనుగోలు, మట్టి పూడ్చివేతల్లోనూ దోచుకున్నారు అని ఫైర్ అయ్యారు. మంగళవారం ఆరిమిల్లి తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. 'వేల్పూరులో సీహెచ్‌సీ నిర్మాణానికి 2019 ఫిబ్రవరిలోనే శంకుస్థాపన చేశాం. 2020లో 25 శాతం పనులు పూర్తికాలేదని నిలిపివేసి, 2022లో జీవో నెం.249తో మళ్లీ అనుమతులు మంజూరుచేశారు. 1.26 సెంట్లు భూమి విరాళం ఇచ్చిన ఆరిమిల్లి వెంకటరత్నం పేరు ఉండకూడదని ఆసుపత్రి నిర్మాణాన్ని పార్కులోకి మార్చారు. అలాగే వైటీ రాజా ఎమ్మెల్యేగా ఉండగానే వేల్పూరు బైపాస్ రోడ్డు ఆలోచన చేసి, చంద్రబాబు హయాంలో పనులు ప్రారంభించారు. టీడీపీ హయాంలోనే గ్రామాల్లో రోడ్లు, డ్రెయిన్లు వేశాం. తణుకులో సెంట్రల్ లైటింగ్ పూర్తి చేశాం' అని ఆరిమిల్లి పేర్కొన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు డాక్టర్ దొమ్మేటి సుధాకర్, బసవా రామకృష్ణ, గోపిశెట్టి రామకృష్ణ, కడియాల సూర్యనారాయణ, గుబ్బల శ్రీనివాసు, తాతపూడి మారుతీరావు, మట్టా వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద సర్పంచ్‌ల నిరాహార దీక్ష

సర్పంచ్‌ల పోరుబాట.. నిరశన దీక్ష

ఏలూరు కలెక్టరేట్, జనవరి 30 : పంచాయతీలకు సంబంధించి తాము ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ సర్పంచ్‌ల పోరుబాటలో భాగంగా మంగళవారం ఉదయం ఏలూరు కలెక్టరేట్ వద్ద సర్పంచ్‌లు ఒక్కరోజు నిరాహార దీక్ష చేపట్టారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పాలడుగుల లక్ష్మణరావు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే ఆర్థికసంఘం నిధులను సర్పంచ్‌లకు తెలియకుండా రాష్ట్ర ప్రభుత్వం తన ఖజానాకు మళ్ళించటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికే తీసేసుకున్న ఆర్థిక సంఘం నిధులను తక్షణమే పంచాయతీ ఖాతాలకు జమ చేయాలని గ్రామ సచివాలయాలను, వలంటీర్లను పంచాయతీల పరిధిలోకి తేవాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. వైసీపీ సర్కార్ దోచేసిన పంచాయతీ నిధులు తిరిగి ఇవ్వాలని గ్రామ పంచాయతీల పరిధిలోవున్న అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు 1415 ఆర్థిక సంఘం నిధులు అనుమతి, పంచాయతీ తీర్మానం లేకుండానే అక్రమంగా ఇతర వాటికి మళ్ళించడం దుర్మార్గమని మండిపడ్డారు. వైసీపీ సర్పంచ్‌లు కూడా బయటకు వచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం విప్పుతున్నారని, సర్పంచ్‌ల ఆందోళనకు జగన్ ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. సర్పంచ్‌లు సురేష్, సునీత, శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు.



పూలబొకేతో సరి !

- నేటి నుంచి 62 ఏళ్ల ఉద్యోగ, ఉపాధ్యాయుల రిటైర్మెంట్లు
- ఆర్థిక ప్రయోజనాలు లేకుండానే ఉసూరుమంటూ ఇంటిబాట
- వేల కోట్ల బకాయిల చెల్లింపుపై ప్రభుత్వ కాలయాపన



ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 30 : వైసీపీ సర్కార్ ఉద్యోగ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచినప్పటికి రిటైర్మెంట్ రోజు వారికి చెల్లించాల్సిన ఆర్థిక ప్రయోజనాలు అందుతాయా ? అనే సందేహం ఇప్పుడు అందరిలోనూ వ్యక్తమవుతోంది. ఎందుకంటే 62 ఏళ్ల పూర్తి చేసుకున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు బుధవారం నుంచి రిటైర్ కానున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల్లో రెగ్యులర్ ప్రాతిపదికన పనిచేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు, [illegible]సుల ఉద్యోగులు సుమారు 27 వేల మంది ఉంటారు. వీరిలో రిటైర్మెంట్ వయసును 62 ఏళ్లకు పెంచడం వల్ల ఈ ఏడాది జనవరి నెలాఖరు నుంచి [illegible]కాలంలో దాదాపు 15 వందల మంది ఉద్యోగ విరమణ చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా వీరి సంఖ్య 16 వేల మందిగా ఉందని ఏపీ ఎన్జీవోల జేఏసీ రాష్ట్ర నాయకుడు హరనాథ్ వెల్లడించారు. ఇలా బుధవారం నుంచి నెలనెలా రిటైర్ అయ్యే వారికి వారి గ్రేడ్‌ను బట్టి ఒక్కొక్కరికి గెజిటెడ్ అధికారి ఉద్యోగి అయితే రూ.40 లక్షల నుంచి రూ.కోటిన్నర వరకు, క్లాస్ ఫోర్ ఉద్యోగి మొదలుకుని ఆఫీస్ సబార్డినేట్ వరకు ఒకొక్కరికి రూ.20 లక్షలు పైబడి వివిధ ఆర్థిక ప్రయోజనాల కింద చెల్లించాలి. ఇంక్రిమెంట్లు, జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ, గ్రాట్యుటీ, సరెండర్ లీవులు, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, కముటేషన్, గ్రూప్ ఇన్సూరెన్స్ తదితర ఆర్థిక ప్రయోజనాలను రిటైర్మెంట్ బెనిఫిట్స్‌గా పరిగణిస్తారు. గతంలో ఈ ఆర్థిక ప్రయోజనాలన్నీ లెక్కగట్టి ఉద్యోగి రిటైర్మెంట్ రోజునే కవర్‌లో పెట్టి సంబంధిత ట్రెజరీ ఆర్డర్లను అందజేసేవారు. ప్రస్తుతం ఈ పరిస్థితి కనుమరుగైంది. అసలు ఏ నెలకానెల జీతం ఇస్తే అదే పది వేలు అనుకునే దుస్థితి రాష్ట్ర ఉద్యోగులు, ఉపాధ్యాయులకు దాపురించింది. ఒకటో తేదీనే జీత భత్యాలను చెల్లించాలంటూ ధర్నాలు, ఆందోళనలు, రాస్తారోకోలు, సమ్మె నోటీసులు ఇచ్చే పరిస్థితులు వచ్చాయి. కొన్ని రాజకీయ పార్టీలైతే తమ ఎన్నికల మేనిఫెస్టోలో ఉద్యోగుల జీతాలను ఒకటినే చెల్లిస్తామని ఓ హామీగా చేరుస్తున్నాయి.

రిటైర్మెంట్ పొడిగింపునకు దూరంగా

ప్రస్తుత ప్రభుత్వ విధానాలతో విసిగిపోయిన పలువురు ఉద్యోగులు, ఉపాధ్యాయులు 62 ఏళ్ళ వరకు విధులు నిర్వర్తించకుండానే స్వచ్ఛంద ఉద్యోగ విరమణ (వీఆర్ఎస్) తీసుకున్నారు. వీరిని మినహాయిస్తే బుధవారం నుంచి రిటైర్ అవుతున్న వారిలోనూ ఆర్థిక ప్రయోజనాల గురించే ఆందోళన నెలకొంది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం వివిధ బకాయిల రూపంలో రూ.20 వేల కోట్లు ఇవ్వాల్సి ఉందని, వీటిని వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ సహా వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు దశలవారీ ఉద్యమాలను చేస్తుండటంతోపాటు, స్థానిక ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులను కలుసుకుని డిమాండ్ చేస్తున్నా ఫలితం లేదు. ఈ నేపథ్యంలో తాజాగా రిటైర్ అవుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన ఆర్థిక ప్రయోజనాల చెల్లింపు ఎప్పటికి జరుగుతుందో చెప్పలేని పరిస్థితులు ఉన్నాయి.

ఇప్పుడు సగం చెల్లించి మిగిలిన మొత్తాలకు బాండులు ఇచ్చే అవకాశం ఉన్నట్టు సమాచారం. అయితే దీనిపై అధికారికంగా స్పష్టత రావాల్సి వుంది. కాగా వీరందరికీ ఫిబ్రవరి నుంచి పెన్షన్ మాత్రం (మార్చిలో) అందుతుంది. మూడు డీఏల బకాయిలు, 11వ పీఆర్సీ ఎరియర్ల తోపాటు, గతేడాది జూలై నుంచి అమల్లోకి రావాల్సిన 12వ పీఆర్సీ ప్రయోజనాలు పొందకుండానే తాజా ఉద్యోగ, ఉపాధ్యాయులంతా మాజీలు అవుతుండడం విచారకరమని ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర అసిస్టెంట్ సెక్రటరీ జనరల్ ఆర్.ఎస్.హరనాథ్ వాఖ్యానించారు.

బుధవారం ఉద్యోగ విరమణ చేసే వారితోపాటు, మిగతా వారికి జనవరి జీతభత్యాలు ఏ తేదీకి ప్రభుత్వం చెల్లిస్తుందో చెప్పలేని పరిస్థితి. దీంతో తాజాగా రిటైర్ అవుతున్న వారందరూ బుధవారం జీతభత్యాలు తీసుకోకుండానే విధులకు గుడ్‌బై చెప్పాల్సి ఉంటుంది. మరోవైపు ఫిబ్రవరి తొలి వారంలోనే ఆసరా కార్యక్రమానికి నిధులను సమకూర్చుకోవడంతోపాటు, జనవరి జీతభత్యాల చెల్లింపునకు ప్రభుత్వం బుధవారం నుంచే నిధులను సమకూర్చుకోవాల్సి ఉంటుంది. ఇక ప్రస్తుతం సర్వీసులోవున్న ఉద్యోగులు మధ్యంతర భృతి(ఐఆర్)ను 30 శాతం ప్రకటించాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు 12వ పీఆర్సీ కమిషనర్‌ను నియమించి ఐదు నెలలు గడుస్తున్నా ఇంతవరకు క్షేత్రస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభమే కాలేదు.

చింతలపూడిపై చిన్నచూపు

- ఎత్తిపోతలు పూర్తి చేయడంలో వైసీపీ సర్కార్ విఫలమైందంటూ రైతు సంఘం నిరసన దీక్ష



నిరసన దీక్ష లో మాట్లాడుతున్న నాయకులు

నూజివీడు టౌన్, జనవరి 30 : రెండు లక్షల ఎకరాలకు పైగా సాగు భూములకు నీటిని అందించే లక్ష్యంతో గత ప్రభుత్వ హయాంలో మొదలుపెట్టిన చింతలపూడి ఎత్తిపోతల పథకం ఫేజ్-1, ఫేజ్-2లను పూర్తి చేయడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైందని రైతు సంఘాల నాయకులు విమర్శించారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి చేయాలని కోరుతూ ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఒకరోజు నిరసన దీక్షను చేపట్టారు. రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి.ప్రసాద్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో ఏ ఒక్క ప్రాజెక్టు ముందుకు సాగలేదన్నారు. రాష్ట్రంలో ప్రధాన ప్రాజెక్టులలో నీటి పరిస్థితి ఆందోళనకరంగా ఉందన్నారు. ఏ పని పూర్తి కావాలన్నా దీక్షలు, ధర్నాలు చాలవని, కచ్చితమైన పోరాట మార్గాలు అన్వేషించాలన్నారు. కౌలు రైతు సంఘం కార్యదర్శి పి.జమలయ్య మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలపట్ల, ప్రాజెక్టుల పట్ల నిబద్ధత లేదన్నారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య మాట్లాడుతూ రైతాంగానికి నీరు అందించటంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. రైతు సంఘం సీనియర్ నాయకులు కొమ్మన నాగేశ్వరరావు మాట్లాడుతూ 2019లో ప్రభుత్వం మారిన తరువాత చింతలపూడి ఎత్తిపోతల పథకం కొండెక్కిందన్నారు. నిరసన దీక్షకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ కాపా శ్రీనివాసరావు, జనసేన సమన్వయకర్త బర్మా ఫణిబాబు, సీపీఎం రైతు సంఘం జిల్లా నాయకులు నిమ్మగడ్డ నరసింహా తదితరు లు మద్దతు ప్రకటించారు. టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం రాగానే చింతలపూడి ఎత్తిపోతలను పూర్తి చేస్తామని ముద్దరబోయిన హామీ ఇచ్చారు. ఆందోళనలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకట రామారావు, రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సోమశేఖర్, రాయంకుల లక్ష్మణరావు, కౌలు రైతు నాయకులు బొంతు కృష్ణ, నియోజకవర్గ రైతు సంఘం కార్యదర్శి మడుపల్లి నాగేంద్రరావు రైతులు పాల్గొన్నారు.

23 ప్రత్యేక రైళ్ల పొడిగింపు
భీమవరం నుంచి బీజేపీ ఎన్నికల శంఖారావం - 7లో..
కొత్తగూడెంలో దూడపై పెద్ద పులి దాడి

హోరాహోరీగా రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు


బ్యాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారిణులు

పెంటపాడు, జనవరి 30 : ప్రత్తిపాడు ఏఎస్ఆర్ హోమియో మెడికల్ కళాశాలలో విజయవాడ డాక్టర్ వైఎస్ఆర్ హెల్త్ యూనివర్సిటీ పరిధిలోని ఆయుష్ అండ్ ఫిజియోథెరపీ ఇంటర్ కాలేజ్ రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు రెండోరోజు మంగళవారం కొనసాగాయి. బ్యాడ్మింటన్, క్రికెట్ తదితర ఆటల పోటీలు హోరాహోరీగా సాగాయి. బుధవారంతో పోటీలు ముగుస్తాయని విజేతలకు బహుమతులు అందజేస్తామని విజయవాడ వైఎస్ఆర్ హెల్త్ యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి డాక్టర్ ఈ.త్రిమూర్తి, ఏఎస్ఆర్ మెడికల్ కళాశాల చైర్మన్ ఆకుల విజయ్‌వర్ధన్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, స్పోర్ట్స్ పరిశీలకులు శ్రీనివాస రాజు, ప్రొఫెసర్లు డాక్టర్ సురేంద్రకుమార్, డాక్టర్ సాయిరాం పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలు


విజేతలకు మెడల్స్ అందిస్తున్న డీఈవో వెంకటరమణ

భీమవరం అర్బన్, జనవరి 30: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభకనబర్చాలని జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటరమణ అన్నారు. భీమవరంలో చింతలపాటి బాపిరాజు స్మారకోన్నత పాఠశాలలో మూడు రోజుల పాటు జరిగిన 67వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ రోప్ స్కిప్పింగ్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. అండర్-14.17,19 విభాగంలో 13 జిల్లాల నుంచి సుమారు 405 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. 36 విభాగాలలో జరిగిన పోటీల్లో 216మంది విజేతలుగా నిలిచారని వీరికి డీఈవో చేతుల మీదుగా మెడల్స్ అందించామని జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ పీఎస్ఎన్ మల్లేశ్వర రావు తెలిపారు. పాఠశాల కరెస్పాండెంట్ కూనపరాజు రామకృష్ణంరాజు, హెచ్ఎం బీ.శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయులు ఎండీ ఖద్దాస్, రామకృష్ణ, జీపీసీ శేఖర్‌రాజు, బీఎన్ రామభద్రరాజు, నర్మద, సునీత తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయశాఖ మంత్రిని కలసిన ఉద్యాన వీసీ


గోవర్ధనరెడ్డిని కలిసిన వీసీ జానకీరామ్

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 30:వ్యవసాయశాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డిని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ టి.జానకీరామ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలో 2024లో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలు, పరిశోధనలను వివరించారు. రిజిస్ట్రార్ బీ.శ్రీనివాసులు, విస్తరణ సంచాలకులు ఈ. కరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

'వైసీపీ పాలనలో గీత వృత్తి సర్వనాశనం'


సమావేశంలో మాట్లాడుతూ ఎంవీ రమణ

తణుకు, జనవరి 30 : వైసీపీ ప్రభుత్వం కల్లుగీత వృత్తిని సర్వనాశనం చేసి ఉన్న ఉపాధిని దెబ్బతీసి గీత కార్మికులు బతకలేని పరిస్థితి కల్పించిందని తెలంగాణ రాష్ట్ర కల్లు గీత కార్మిక సంఘం అధ్యక్షుడు ఎంవీ రమణ అన్నారు. మంగళవారం స్థానిక లయన్స్ ఆడిటోరియంలో ఆహ్వాన సంఘం అధ్యక్షుడు కామన మునిస్వామి అధ్యక్షతన ఏపీ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర 15వ మహాసభలు నిర్వహించారు. తొలుత మున్సిపల్ కార్యాలయం నుంచి రాష్ట్రపతి రోడ్డుమీదుగా సభా ప్రాంగణం వరకు గీత కార్మికులు మోకులు ధరించి ర్యాలీ నిర్వహించారు. సంఘ మాజీ గౌరవాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్ మాట్లాడుతూ పాదయాత్రలో గీత కార్మికులకు ఇచ్చిన హామీలు వైసీపీ నాయకులు ఎందుకు అమలు చేయలేదన్నారు. ఈత చెట్లపై గీత కార్మికులకు హక్కులు లేకుండా చేసి వృత్తిని దెబ్బతీశారని విమర్శించారు. అనంతరం కుల వృత్తిదారులు సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎం.భాస్కరయ్య మాట్లాడారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు జుత్తిగ నరశింహమూర్తి, సంఘ నాయకులు గుబ్బల వీరరాఘవులు, కడలి పాండు, పీవీ ప్రతాప్, గార రంగారావు, గుబ్బల గోపి, కేతా గోపాలన్, డాక్టర్ దొమ్మేటి వెంకటసుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

'నన్నయ'లో నేడే పట్టాల పండుగ

స్నాతకోత్సవానికి ఏర్పాట్లు పూర్తి.. రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ రాక



స్నాతకోత్సవ వేదిక వద్ద ద్వారం

రాజమహేంద్రవరం, జనవరి 30: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం 13, 14, 15వ స్నాతకోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. విశ్వవిద్యాలయంలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ భవనంలో బుధవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి నిర్వహించనున్న కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ విచ్చేసి పట్టాల ప్రదానం చేస్తారని వీసీ పద్మరాజు తెలిపారు. ముఖ్యఅతిథిగా ఇన్ఫోసిస్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ సుధామూర్తి హాజరై ప్రసంగిస్తారని, విశ్వవిద్యాలయం తరపున ఆమెకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేస్తామన్నారు. అతిథులుగా ఉన్నత విద్య ప్రిన్సిపల్ కార్యదర్శి జె.శ్యామలరావు, కళాశాల విద్య కమిషనర్ పోలా భాస్కర్, రాష్ట్ర ఉన్నతవిద్య మండలి ఛైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి తదితరులు విచ్చేయనున్నారని చెప్పారు. పట్టాలు స్వీకరించేందుకు సూచించిన నిబంధనలను పాటిస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనికోరారు.


పెదనింద్రకొలను కవితా సమ్మేళనంలో పాల్గొన్న రచయితలు

'గాంధీ ఆశయాలు నేటి యువత పాటించాలి'

నిడమర్రు జనవరి 30 : ఈ శతాబ్దపు అత్యున్నత విలువలు కలిగిన వ్యక్తిగా వెలుగొందిన జాతిపిత గాంధీజీ ఆశయాల నేటి యువత పాటించాలని జిల్లా సర్వోదయమండలి ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు పిలుపునిచ్చారు. మంగళవారం పెదనింద్రకొలను గాంధీభవనంలో మహాత్మాగాంధీ 76వ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత ఉన్నత పాఠశాల విద్యార్థులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. జిల్లా సర్వోదయమండలి అధ్యక్షురాలు చర్ల మృదులకుమారి, సర్వోదయ మండలి నాయకులు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సమావేశానికి హాజరైన వక్తలు గాంధీ జీవన విధానం, సత్యాగ్రహ దీక్ష విశిష్టతను విద్యార్థులకు విశదీకరించారు. చివరగా గాంధేయం అనే అంశంపై కవితాసమ్మేళనం నిర్వహించి 25 మంది కవులకు కవితాపురస్కారాలు అందజేశారు. సర్వోదయమండలి నాయకులు పాల్గొన్నారు

మహాత్మా.. మన్నించు..


ద్వారకాతిరుమల మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద బోసిగా గాంధీ విగ్రహం

ద్వారకాతిరుమల, జనవరి 30: జాతిపిత, మహాత్ముడు గాంధీ వర్ధంతినే మరిచారు స్థానిక అధికారులు. తమకు నచ్చిన రాజకీయనాయకుల పుట్టినరోజులు, వర్ధంతులను గుర్తుపెట్టుకుని మరీ హడావుడి చేసే నాయకులు కనీసం దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిపెట్టిన గాంధీజీ వర్ధంతిని జరపకపోవడం విచారకరం. ద్వారకాతిరుమల మండల ప్రజాపరిషత్ కార్యాలయ సముదాయంలో మహాత్ముని విగ్రహం ఈవిధంగా కనీసం పూలదండకు కూడా నోచుకోలేదు.

దూడపై పెద్దపులి దాడి

కొత్తగూడెంలో కలకలం.. దూడను తినడం చూసి చెట్టెక్కిన రైతు


పులి వదలిన దూడ అవయవాలు


పులి పాదముద్ర




పులి భయంతో చెట్టెక్కిన రైతును దింపుతున్న స్థానికులు

స్థానికులతో మాట్లాడుతున్న ఫారెస్ట్ అధికారులు.

- ట్రాప్ కెమెరాలు, బోను ఏర్పాటు చేసిన అధికారులు
- భయపడుతున్నరైతులు, స్థానిక ప్రజలు

ద్వారకాతిరుమల/నల్లజర్ల/పోలవరం, జనవరి 30 : ఉమ్మడి జిల్లాలో పులి సంచారంపై వారం రోజులుగా ప్రజల్లో భయాందోళన నెలకొంది. అధికారులు అప్రమత్తమైనప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో ఆయా ప్రాంతాల్లో రైతులు, ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. తాజాగా మంగళవారం పెద్దపులి సంచారం ద్వారకాతిరుమల మండలం కొత్తగూడెంలో తీవ్ర సంచలనాన్ని రేకెత్తించింది. దూడను చంపి తింటున్న పులిని చూసిన రైతు ప్రాణభయంతో సమీపంలో ఉన్న చెట్టును ఎక్కాడు. వారం రోజులుగా ఉమ్మడి జిల్లాలో పులి సంచారం ప్రజలను బెంబేలెత్తిస్తుంది. ఈ క్రమంలో ద్వారకాతిరుమల రామసింగవరం పంచాయతీ కొత్తగూడెం శివారులోని రైతు ముక్కివల్లి బాలసుందరరావు తోటలో దూడపై దాడి చేసి చంపి అడవిలోకి లాక్కుని వెళ్లింది. ఈ ఘటనను ప్రత్యక్షంగా చూసిన రైతు బెంబేలెత్తి భయాందోళనతో చెట్టు ఎక్కిప్రాణాలను కాపాడుకున్నాడు. ఆ రైతు ఇచ్చిన సమాచారాన్ని అందుకున్న స్థానికులు ఘటనా స్థలానికి చేరుకుని రైతును కిందకు దింపి మాట్లాడి ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. ఘటనా ప్రాంతానికి చేరుకున్న అధికారులు, సిబ్బంది పరిసరాలను పరిశీలించి పులిసంచరించిన ప్రాంతాల్లో ట్రాప్ కెమేరాలను అమర్చారు. పులిని బంధించేందుకు బోన్లను సిద్ధం చేశారు. స్థానిక రైతులు, ప్రజలు బయటకు రావాలంటేనే భయపడుతున్నారు.

అధికారులు స్పందించడం లేదు

పెద్దపులి కనిపించిందని గ్రామస్థులు ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చిన వెంటనే స్పందించడం లేదని పలు గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పులి వచ్చిన 5, 6 గంటలకు వచ్చి తూతూమంత్రంగా పాదముద్రలు సేకరించి వెళ్లిపోతున్నారని చెబుతున్నారు. నల్లజర్ల మండలంలో తొమ్మిది ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేసినప్పటికీ ఒక్క కెమెరాలోను పులి జాడ కానరాలేదు.

ప్రజలు, మూగ జీవాలకు రక్షణ కరువు

పెద్దపులి సంచరిస్తుందని పదే పదే ప్రజలు గగ్గోలు పెడుతున్నా ఫారెస్ట్ అధికాలు మిగతా ప్రభుత్వ విభాగాల అధికారులను సమన్వయం చేసుకోకుండా ఒంటరిగా వచ్చి వెళ్ళుతున్నారు తప్ప ప్రజలకు, పశువుల పెంపకందారులకు భరోసా కల్పించలేకపోతున్నారు. పొలం పనులకు వెళ్లాలంటే వ్యవసాయ కూలీలు, రైతులు భయపడిపోతున్నారు. పులి సంచరిస్తున్న గ్రామాల్లో పోలీసులు, ఇతర శాఖల అధికారులతో సమన్వయమై ప్రజలు, మూగజీవాల ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు. అవసరమైతే గ్రామంలో కొంత మంది యువకులను వలంటీర్లుగా ఉపయోగించుకోవాలని చెబుతున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : తహసీల్దార్ సుమతి

పోలవరం మండలంలో అటవీ ప్రాంతాలకు దగ్గరగా ఉండే గ్రామాల ప్రజలు పెద్దపులి సంచారంపై అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ బి.సుమతి సూచించారు. పోలవరం మండలంలో సరిహద్దు ప్రాంతాలైన జిల్లెల్లగూడెం, ఎల్లండీపేట, గెడ్డపల్లి, నాగంపాలెం గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పులి సంచారం పట్ల ఆనవాళ్ళు సమా చారం తెలిసిన వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

సాదాసీదాగా జడ్పీ స్థాయీసంఘ సమావేశాలు

- ప్రజాసంక్షేమం, అభివృద్ధిలో తోడ్పాటు అందించాం : జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ


సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

ఏలూరుసిటీ, జనవరి 30:ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జిల్లా ప్రజాపరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు సాదాసీదాగా జరిగాయి. మంగళవారం జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో 1 నుంచి 7వరకు స్థాయీ సంఘ సమావేశాలను జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన నిర్వహించారు. ప్రధానంగా 1వ స్థాయి, 7వ స్థాయి సంఘ సమావేశాల్లో విస్తృతమైన చర్చ జరిగింది. అభివృద్ధి పనులు మంజూరు విషయంలోను, చేసిన పనులకు బిల్లులు చెల్లించే విషయంలో పలు సందేహాలను జడ్పీటీసీలు లేవనెత్తారు. జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనులపై జడ్పీటీసీలు చర్చించారు. సార్వత్రిక ఎన్నికలు రాబోతున్న నేపథ్యంలో ఈస్థాయి సంఘ సమావేశాలు చివరి సమావేశాలు కావడంతో జడ్పీటీసీ సభ్యులు పలు అంశాలుపై ప్రశ్నలు సంధించారు. వాటికి ఆయా శాఖల ఉన్నతాధికారులు సమాధానాలు ఇచ్చారు. గాంధీజీ కలలుకన్న గ్రామ స్వరాజ్యాన్ని అమలు పరిచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ అన్నారు. స్థాయీ సంఘాల సమావేశాల్లో ఆమె మాట్లాడుతూ త్వరలో సార్వత్రిక ఎన్నికలు రాబోతున్న సందర్భంగా ఈ స్థాయీ సంఘ సమావేశాలు చివరి సారిగా నిర్వహించుకుంటున్నామని అదేవిధంగా ఫిబ్రవరి 10న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామన్నారు. జడ్పీ చైర్‌పర్సన్‌గా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో భాగస్వామ్యం అయినందుకు ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో అధికారులు వారివరీ శాఖల వారీగా చేపట్టిన పనులు, ఇంకా పెండింగ్‌లో ఉంటే త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు మంచి చేయాలని కోరారు. అనంతరం సమావేశంలో ప్రణాళిక, ఆర్థికస్థాయి, పనుల స్థాయి, గ్రామీణాభివృద్ధి స్థాయి, విద్య వైద్యసేవలు స్థాయి, మహిళా సంక్షేమం స్థాయి, సాంఘిక సంక్షేమం స్థాయి, వ్యవసాయ స్థాయి సంఘ సంఘాల సభ్యులు అధికారులతో సంబంధిత పథకాల పురోగతిపై సమీక్ష చేశారు. తొలుత జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సంఘ సభ్యులు, అధికారులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. జడ్పీ సీఈవో కేఎస్ఎస్ సుబ్బారావు, జడ్పీ డిప్యూటీ సీఈవో నిర్మలాజ్యోతి, పలు శాఖల అధికారులు, జడ్పీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

భీమవరంనుంచి బీజేపీ ఎన్నికల శంఖారావం

- పార్టీ రాష్ట్ర కార్యదర్శి భూపతిరాజు శ్రీనివాసవర్మ


మాట్లాడుతున్న బీజేపీ నేత శ్రీనివాసవర్మ

భీమవరం, జనవరి 30 : రానున్న ఎన్నికలకు భీమవరం నుంచి బీజేపీ ఎన్నికల శంఖారావాన్ని ప్రారంభిస్తుందని పార్టీ రాష్ట్ర కార్యదర్శి భూపతి రాజు శ్రీనివాస వర్మ తెలిపారు. భీమవరంలో వచ్చేనెల ఒకటిన రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి చేతుల మీదుగా నరసాపురం పార్లమెంట్ బీజేపీ ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఇక్కడి నుంచే రాష్ట్రంలోని 13 జిల్లాల్లో ఎన్నికల కార్యాలయాలను వర్చువల్‌గా ఆమె ప్రారంభిస్తారన్నారు. నూరుశాతం పోలింగ్ బూత్ కమిటీలను ఏర్పాటు చేసి ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామన్నారు. పొత్తుల వ్యవహారం అలా ఉంచితే ఇక్కడ నరసాపురం పార్లమెంట్‌లో బీజేపీ పోటీ చేస్తుందని, తానే అభ్యర్థిగా ఉంటానన్నారు. 2009లో ఒకసారి పోటీ చేశానని, ఇప్పుడు పోటీలో ఉన్నానన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటినీ ప్రజలకు వివరిస్తామన్నారు. జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలన్నీ ప్రజలకు చేరువయ్యా యన్నారు. అనంతరం లోక్‌సభ పార్టీ కన్వీనర్‌గా నియమితులైన పేరిచర్లసుభాష్‌రాజును అభినందించారు. పట్టణ అధ్యక్షుడు కాయిత సురేంద్ర, మీడియా సెల్ కన్వీనర్ అడబాల శివ తదితరులు పాల్గొన్నారు.

మృతులూ ఓటర్లే..

- ఓటర్ల జాబితాలో తొలగించని చనిపోయిన వారి పేర్లు


జంగారెడ్డిగూడెం మండలంలో ఓటర్ల జాబితాలో వున్న మృతుల పేర్లు

జంగారెడ్డిగూడెం, జనవరి 30 : ఓటర్ల తుది జాబితా అయోమయం. ఎప్పుడో చనిపోయిన వారికి కూడా ఓటు హక్కు కల్పించి బతికించారు. అధికారుల పర్యవేక్షణా లోపం, సిబ్బంది నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కన్పిస్తోంది. జంగారెడ్డిగూడెం మండలం కేతవరంలో దాదాపు 27 మంది గతంలో మృతి చెందిన వారి ఓట్లను తొలగించాలని గ్రామస్థులు గతంలో ఫిర్యాదు చేశారు. దానికి ఊ కొట్టిన అక్కడ బీఎల్‌వోలు వాటిని తొలగించపోవడంతో నేరుగా జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపి ఇద్దరు బీఎల్‌వోలను, ఒక వీఆర్వోను సస్పెండ్ చేశారు. కానీ వాస్తవానికి ప్రతివార్డులోను ఇదే పరిస్థితి ఉన్నట్టు ఓటర్ల జాబితాను పరిశీలిస్తే తెలుస్తుంది.

- జంగారెడ్డిగూడెం మున్సిపల్ పరిధిలోని 5వ వార్డు 32వ పోలింగ్ బూత్ పరిధిలోని సీరియల్ నెంబరు 20లో ఉన్న గున్నాబత్తుల బాబీ సరోజిని(57). ఈమె చనిపోయిన సుమారు మూడేళ్లు అవుతుంది. ఓటు మాత్రం ఉంది.
- 32 పోలింగ్ బూత్‌లో చిన్న వీరరాఘవాచార్యులు శ్రీరాములు (79) చనిపోయి నాలుగేళ్లు అవుతోంది. ఇదే బూత్‌లో చీమకుర్తి రామచంద్రరావు, చీమకుర్తి సుబ్బారావు ఇద్దరూ చనిపోయి నాలుగేళ్లయింది. వందనపు లక్ష్మణరావు ఎనిమిదేళ్ల క్రితం మృతి చెందారు.
- 53వ పోలింగ్ బూత్‌లో కొల్లేపర గాంధీ, మోతే సూర్యనారాయణ, మహ్మద్ బాజీ ముగ్గురూ ఐదేళ్ల క్రితమే మృతి, కొప్పుల శ్రీను మూడేళ్ల క్రిందట, శీమకుర్తి ఆదిలక్ష్మి ఏడాది క్రితం మృతి చెందారు.

ఇరగవరం మండలంలో..


ఇరగవరం మండలంలో మృతులు

ఇరగవరం : ఇరగవరం మండలం రేలంగిలో 155, 156, 157వ పోలింగ్ కేంద్రాలలో ప్రదర్శించిన ఓటర్ల జాబితాలో మృతుల ఓట్లను యథావిధిగా ఉంచేశారు. 155వ పోలింగ్ కేంద్రంలో బొర్రా సుబ్బారావు, బొర్రా సత్యవతి, ఈరి వెంకటలక్ష్మీ, 157వ పోలింగ్ కేంద్రంలో మేకా శశిరేఖ, మంగెన సుబ్బలక్ష్మీ, వరద ముత్యాంబ, పెదసనగంటి వెంకటరత్నం, నాగేశ్వరరావు మరణించినా వారి పేర్లు తొలగించకుండా జాబితాలో దర్శనమిచ్చాయి. ఈ విషయమై అధికారులను వివరణ కోరగా మృతులకు సంబంధించిన పూర్తిస్థాయి నిర్ధారణ ధ్రువపత్రాలు సమర్పించలేదని మరికొంత మంది దరఖాస్తే చేయలేదని చెప్పారు.

రెండేసి ఓట్లు..

రేలంగి గ్రామానికి చెందిన బొడ్డు నాగరాజుకు 155 పోలింగ్ బూత్‌లో సీరియల్ నంబరు 464తో ఒక ఓటు, అదే గ్రామంలో 156 పోలింగ్ బూత్ సీరియల్ నంబరు 835 మరో ఓటు ఉంది. అదే గ్రామానికి చెందిన కొర్ల వెంకన్నబాబుకు 155 పోలింగ్ బూత్‌లో సీరియల్ నబరు 396తో ఒక ఓటు, సీరియల్ నంబరు 857తో మరో ఓటు ఉంది.

ఉంగుటూరు మండలంలో డబుల్ ఎంట్రీ..


డబుల్ ఎంట్రీగా నమోదైన ఓటర్లు

ఉంగుటూరు : ఉంగుటూరు మండలం అప్పారావుపేట, నారాయణపురంలోని పోలింగ్ బూత్‌లలో ఒకే ఓటు రెండేసి సార్లు నమోదు చేయడంపై రెవెన్యూ అధికారుల తీరు పలు అనుమానాలకు తావిస్తోంది. అప్పారావుపేట (57)లో ఉన్న బళ్ళ పద్మావతి(110), బళ్ల వెంకట రామారావు(111), బళ్ళ అనిల్ (114)ఓటరు జాబితాలో ఉండగా అవే ఓట్లు నారాయణ పురం పో లింగ్ బూత్(55) లోనూ ఉన్నాయి. దీనిలో భాగంగా బళ్ళ పద్మావతి (1151), బళ్ల వెంకట రామారావు (1150), బళ్ల అనిల్ (1152)గా నమోదవడంతో రెవెన్యూ అధికా రుల తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

క్రైం కార్నర్

టిప్పర్ ఢీకొని కూలీ మృతి


అంబేద్కర్ సెంటర్‌లో ధర్నా నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు, బంధువులు

టి.నరసాపురం, జనవరి 30 : టిప్పర్ లారీ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన టి.నరసాపురం హైవేపై మంగళవారం జరిగింది. వివరాలివి. టి. నరసాపురంలో నూతనంగా నిర్మితమవుతున్న గ్రీన్‌ఫీల్డ్ హైవేపై మట్టిని తరలిస్తున్న టిప్పర్ కూలిపని నిమిత్తం వెళుతున్న టి.నరసాపురానికి చెందిన పెసనగంటి మరియన్న(58)ను ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య బుజ్జి, కుమారుడు మంగరాజు తమకు న్యాయం జరిగే వరకు మృతదేహాన్ని తరలించడానికి వీలులేదని కొంతసేపు ధర్నా నిర్వహించారు. అనంతరం పోలవరం నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి లంకా జయబాబు ఆధ్వర్యంలో టి.నరసాపురం ప్రధానసెంటర్లో రహదారిని నిర్బంధించి ధర్నా చేశారు. జయబాబు మాట్లాడుతూ బాధిత కుటుంబానికి న్యాయం జరగకపోతే జిల్లా తద్వారా రాష్ట్రవ్యాప్తంగా ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఘటనా స్థలాన్ని జీలుగుమిల్లి సీఐ క్రాంతికుమార్ సందర్శించి టిప్పర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. పల్లిపాం జోసెఫ్ తంబీ, నాగేంద్రబాబు, బర్రె సత్యనారాయణ, నందిపాం రవి పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి ఒకరి మృతి

ఏలూరు క్రైం, జనవరి 30 : ఓ వ్యక్తి ఎక్కాల్సిన రైలు కాకుండా వేరే రైలు ఎక్కి పొరపాటున ఎక్కానని భావించి వెంటనే రైలు దిగే క్రమంలో ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందాడు. ఏలూరు రైల్వే ఎస్ఐ డి. నరసింహారావు తెలిపిన వివరాలివి.. ఏలూరు రూరల్ మండలం కొమడవోలు పంచాయతీ వీవీ నగర్‌కు చెందిన తేటకల కనకదుర్గాగోవర్ధన్(44) మంగళవారం తెల్లవారుజామున విశాఖపట్టణం వెళ్లేందుకు తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కవలసి ఉంది. పొరపాటున గౌతమి రైలు ఎక్కగా ప్రయాణికులు కాదని చెప్పడంతో వెంటనే దిగుతుండగా రైలు కదిలిపోయింది. రైలు కిందపడి గాయాలకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై ఏలూరు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం జరిపి బంధువులకు అప్పగించారు.

కాటన్ బ్యారేజీపై రాకపోకలు నిలుపుదల


బొబ్బర్లంక బ్యారేజీ వద్ద చేపట్టిన పనులు

ఆత్రేయపురం, జనవరి 30: ఉభయ గోదావరి జిల్లాలకు వారధిగా ఉన్న కాటన్ బ్యారేజీపై రాకపోకలను నిలుపుదల చేశారు. కొన్నేళ్లుగా బ్యారేజీ ఛిద్రమై అస్తవ్యస్తంగా మారింది. బ్యారేజీని పటిష్టపరచాలని ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు ఆందోళన సైతం నిర్వహించాయి. ఈ నేపథ్యంలో ధవళేశ్వరం నుంచి విజ్జేశ్వరం వరకు బ్యారేజీ, రోడ్డు మరమ్మతులకు ప్రభుత్వం రూ.2 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో బ్యారేజీపై తారుపొరలను తొలగించి గోతులు పూడ్చే కార్యక్రమాన్ని చేపడుతున్నారు. బుధవారం నుంచి పది రోజుల పాటు వాహనాల రాకపోకలు నిలుపుదల చేస్తున్నట్టు బ్యారేజీ డీఈ ప్రదీప్ కుమార్ తెలిపారు.

బల్లిపాడు పాఠశాలలో ఎస్పీ సందర్శన


బల్లిపాడు పాఠశాలను సందర్శించిన ఎస్పీ

అత్తిలి, జనవరి 30 : విద్యార్థినులపై లైంగిక దాడి ఘటనపై పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ రవిప్రకాశ్ మంగళవారం బల్లిపాడు గ్రామంలో పాఠశాలను సందర్శించారు. పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్ నెహ్రూ విద్యార్థినులపై లైంగిక దాడికి పాల్పడిన ఘటనలో ఆయన స్థానికుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధిత విద్యార్థినులతో మాట్లాడారు. డీఎస్పీ శరత్‌రాజ్‌కుమార్, తణుకు రూరల్ సీఐ జీవీ సత్యనారాయణ, అత్తిలి ఎస్ఐ వి.రాంబాబు, తదితరులు ఉన్నారు.

శాశ్వత లోక్ అదాలత్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న మేరీ గ్రేస్ కుమారి

ఏలూరు క్రైం, జనవరి 30 : శాశ్వత లోక్ అదాలత్ అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పర్మినెంట్ లోక్‌అదాలత్ చైర్‌పర్సన్ ఎ.మేరీ గ్రేస్‌కుమారి అన్నారు. మంగళవారం ఏలూరులోని పర్మినెంట్ లోక్ అదాలత్ భవనంలో పలు శాఖల అధికారులతో సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ లోక్‌అదాలత్‌లో విద్య, వైద్య, పోస్టల్, ఇన్సూరెన్స్, రియల్ ఎస్టేట్, రవాణా, పారిశుధ్యం, బ్యాంకింగ్, ఎన్ఆర్ఈజీఎస్ సేవలలో లోపం జరిగితే పర్మినెంట్ లోక్ అదాలత్ ద్వారా న్యాయం పొందవచ్చన్నారు. ఇక్కడ ఇచ్చే తీర్పులకు అప్పీలు ఉండదని అన్నారు. ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని ఉచితంగా న్యాయం పొందవచ్చన్నారు. సంబంధిత అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు.

23 ప్రత్యేక రైళ్ల పొడిగింపు

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా సౌత్ సెంట్రల్ రైల్వే నిర్ణయం

ఏలూరు క్రైం, జనవరి 30 : సౌత్ సెంట్రల్ రైల్వే 23 ప్రత్యేక రైళ్లను ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పొడిగించింది. (08579) విశాఖపట్టణం - సికింద్రాబాద్ ప్రతి బుధవారం ఫిబ్రవరి 7నుంచి మార్చి 27 వరకు పొడిగింపు. (08580) సికింద్రాబాద్-విశాఖపట్టణం ప్రతి గురువారం ఫిబ్రవరి 8 నుంచి మార్చి 28 వరకు, (08583) విశాఖపట్టణం-తిరుపతి ప్రతి సోమవారం ఫిబ్రవరి 5 నుంచి మార్చి 25 వరకు, (08584) తిరుపతి-విశాఖపట్టణం ప్రతి మంగళవారం ఫిబ్రవరి 6 నుంచి మార్చి 26 వరకు, (08543) విశాఖపట్టణం-ఎస్ఎంవీటీ బెంగళూరు ప్రతి ఆదివారం ఫిబ్రవరి 4 నుంచి మార్చి 31 వరకు, (08544) ఎస్ఎంవీటీ బెంగుళూరు-విశాఖపట్టణం ప్రతి సోమవారం ఫిబ్రవరి 5 నుంచి ఏప్రిల్ 1 వరకు, (02809) భువనేశ్వర్-తిరుపతి ప్రతి శనివారం ఫిబ్రవరి 3 నుంచి మార్చి 30 వరకు, (02810) తిరుపతి-భువనేశ్వర్ ప్రతి ఆదివారం ఫిబ్రవరి 4 నుంచి మార్చి 31 వరకు, (03253) పాట్నా-సికింద్రాబాద్ ప్రతి సోమవారం, బుధవారం ఫిబ్రవరి 5 నుంచి ఏప్రిల్ 29 వరకు, (07255) హైదరాబాద్-పాట్నా ప్రతి బుధవారం ఫిబ్రవరి 7 నుంచి మే 1 వరకు, (07256) సికింద్రాబాద్ - పాట్నా ప్రతి శుక్రవారం ఫిబ్రవరి 9 నుంచి ఏప్రిల్ 26 వరకు, (03225) ధనాపూర్-సికింద్రాబాద్ ప్రతి గురువారం ఫిబ్రవరి 1 నుంచి ఏప్రిల్ 25 వరకు, (03226) సికింద్రాబాద్ -ధనాపూర్ ప్రతి ఆదివారం ఫిబ్రవరి 3 నుంచి ఏప్రిల్ 28 వరకు, (03245) ధనాపూర్-ఎస్ఎంవీటీ బెంగళూరు ప్రతి బుధవారం ఫిబ్రవరి 7 నుంచి ఏప్రిల్ 24 వరకు, (03246) ఎస్ఎంవీటీ బెంగళూరు-ధనాపూర్ ప్రతి శుక్రవారం ఫిబ్ర వరి 9 నుంచి ఏప్రిల్ 26 వరకు, (03251) ధనాపూర్-ఎస్ఎంవీటీ బెంగళూరు ప్రతి ఆదివారం, సోమవారం ఫిబ్రవరి 4 నుంచి ఏప్రిల్ 29 వరకు, (03252) ఎస్ఎంవీటీ బెంగళూరు - ధనాపూర్ ప్రతి గురువారం, బుధవారం ఫిబ్ర వరి 6 నుంచి మే 1 వరకు, (03259) ధనాపూర్- ఎస్ఎంవీటీ బెంగళూరు ప్రతి గురువారం ఫిబ్రవరి 6 నుంచి ఏప్రిల్ 30 వరకు, (03260) ఎస్ఎంవీటీ బెంగళూరు-ధ నాపూర్ ప్రతి గురువారం ఫిబ్రవరి 8 నుంచి మే 2 వరకు, (03247) ధనాపూర్-ఎస్ఎంవీటీ బెంగళూరు ప్రతి గురువారం ఫిబ్రవరి 1 నుంచి ఏప్రిల్ 25 వరకు, (03248) ఎస్ఎంవీటీ బెంగళూరు-ధనాపూర్ ప్రతి శనివారం ఫిబ్రవరి 3 నుంచి ఏప్రిల్ 27 వరకు, (03241) ధనాపూర్- ఎస్ఎంవీటీ బెంగళూరు ప్రతి శుక్రవారం ఫిబ్రవరి 2 నుంచి ఏప్రిల్ 26 వరు, (03242) ఎస్ఎంవీటీ బెంగళూరు- ధనాపూర్ ప్రతి ఆదివారం ఫిబ్రవరి 4 నుంచి ఏప్రిల్ 28 వరకు ప్రయాణిస్తాయి.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

లింగపాలెం, జనవరి 30: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన ధర్మాజీగూడెంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. యడవల్లి గ్రామానికి చెందిన కర్రి వెంకన్న అనేవ్యక్తి ఐస్‌క్రీమ్‌లు అమ్ముకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. మంగళవారం ఐస్ క్రీమ్‌లు అమ్ముకుంటూ ధర్మాజీగూడెం వస్తుండగా, ఏలూరు వైపునుంచి వస్తున్న కారు ఎదురుగా వచ్చి ఢీ కొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. ప్రమాద ఘటన నుంచి కారులోని వ్యక్తి కారువదిలి వెళ్ళిపోయినట్టు పోలీసులు తెలిపారు. గాయాలపాలైన వెంకన్నను మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెన్నారావు తెలిపారు.

పట్టిసీమ ఫెర్రీ పరిశీలించిన అధికారులు



రేవు పరిశీలిస్తున్న తహసీల్దారు సుమతి

పోలవరం, జనవరి 30: పట్టిసీమ శివక్షేత్రంలో ఫెర్రీ తహసీల్దారు బి.సుమతి, అధికారులు మంగళవారం పరిశీలించారు. మార్చి 8, 9 తేదీలలో పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి శివక్షేత్రంలో మహాశివరాత్రి ఉత్సవాల నేపథ్యంలో భక్తులు గోదావరి నది దాటేందుకు తాత్కాలిక వారధి ఏర్పాటు చేస్తున్నారు. సంబంధిత కాంట్రాక్టరు చేపట్టిన పనులను తహసీల్దారు పరిశీలించారు. సత్యసాయి మంచినీటి పంపింగ్ స్కీం సమీపంలో నీటి ప్రవాహం అధికం కావడంతో ఉంచుకుని రామకృష్ణ గీతాశ్రమం సమీపంలో ర్యాంపు ఏర్పాటు చేస్తున్నారు. నదిపై తాత్కాలిక వారధి ఏర్పాటు, భక్తుల రాకపోకలకు భద్రత, తదితర అంశాలపై తహసీల్దారు ఇతర శాఖల అధికారులతో కలిసి పరిశీలించి చర్చించారు. కార్యక్రమంలో ఎస్ఐ పవన్ కుమార్, బోట్ సూప రింటెండెంట్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

చింతలపూడి ఎత్తిపోతల నిర్మాణం పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

ఏలూరు టూటౌన్, జనవరి 30: చింతలపూడి ఎత్తిపోతల పథకం నిర్మాణం పూర్తి చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అన్నే భవన్‌లో రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమ గోదావరి, కృష్ణ జిల్లాల పరిధిలో 4.5లక్షల ఎకరాలకు సాగు నీరందించే పథకం పూర్తి చేయకుండా వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం అందించాలన్నారు. జిల్లా అధ్యక్షుడు నిమ్మగడ్డ నరసింహ, సహాయ కార్యదర్శి భాస్కరరావు పాల్గొన్నారు.

గంజాయి నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ఏలూరు కలెక్టరేట్, జనవరి 30: గంజాయి నియంత్రణలో నిఘా పెంచాలని, గంజాయితో అనర్థాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో నార్కో కోఆర్డినేషన్ సెంటర్ జిల్లా కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. గంజాయి నియంత్రణ, డ్రగ్స్ అక్రమ రవాణా తదితర అంశాలపై తీసుకున్న చర్యలపై ఎస్పీ డి.మేరీప్రశాంతితో కలిసి ఆయన సమీక్షించారు. ఎస్పీ మేరీప్రశాంతి మాట్లాడుతూ గంజాయి రవాణా, సరఫరా వినియోగం నియంత్రణలో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు వివరించారు. జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఏఎస్పీ సూర్యచంద్రరావు మాట్లాడుతూ ఇతర ప్రాంతాల నుంచి జిల్లా మీదుగా రవాణా జరుగుతుందని, అరికట్టేందుకు దాడులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, డీఈవో పి.శ్యామ్‌సుందర్, ఉప రవాణా కమిషనర్ శాంతకుమారి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం



సదస్సులో మాట్లాడుతున్న రత్న ప్రసాద్

ఏలూరు క్రైం, జనవరి 30 : లింగనిర్ధారణ పరీక్షలు నేరమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రత్న ప్రసాద్ అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో న్యాయసేవాధికార భవన్‌లో జిల్లాలోని రేడియాలజిస్టు, ల్యాబ్ టెక్నీషియన్లకు మంగళవారం అవగాహన సదస్సును నిర్వహించారు. రత్నప్రసాద్ మాట్లాడుతూ లింగనిర్ధారణ పరీక్షలు చేసిన ఆసుపత్రిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వైద్య పరీక్ష కేంద్రాలు ఎటువంటి ఒత్తిళ్ళకు తలవంచకుండా నడుచుకోవాలన్నారు. వినియోగదారుల ఫోరం కమిషన్ జిల్లా సభ్యురాలు కెఎస్ నాగలక్ష్మి, డిప్యూటీ డెమో నాగరత్నం, భాస్కర్ పాల్గొన్నారు.

మానవ తప్పిదాల వల్లే అధిక ప్రమాదాలు



మాట్లాడుతున్న సీఐ రాజేష్

జంగారెడ్డిగూడెం, జనవరి 30: మానవ తప్పిదాల వల్లే అధికంగా ప్రమాదాలు సంభవిస్తున్నాయని సీఐ పి.రాజేష్ అన్నారు. ఆర్టీసీ భద్రతా మాసోత్సవాలలో భాగంగా డ్రైవర్లకు, కండక్టర్లకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ రాజేష్ మాట్లాడుతూ ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చే బాధ్యత ఆర్టీసీ డ్రైవర్లపై ఉందన్నారు. డిపో మేనేజర్ వీపీవి గంగాధరరావు మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్‌లకు శారీరక, మానసిక ఒత్తిడి వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రతీ డ్రైవర్‌కు డ్యూటీ తర్వాత విశ్రాంతి అవసరమన్నారు. కార్యక్రమంలో డిపో ఎంటి వరలక్ష్మి, మెకానికల్ ఫోర్మెన్ కేశవ కుమార్, డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

అధిక వేగం ప్రాణాపాయం

భీమడోలు, జనవరి 30: వాహనాలను అధిక వేగంగా నడిపి ప్రాణాలను పోగొట్టుకునే పరిస్థితి తెచ్చుకోవద్దని ఎంవీఐ కేవీఎస్.ప్రసాద్ సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం బస్సు డ్రైవర్లు, క్లీనర్లు, విద్యార్థులకు రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మెళకువలతో వ్యవహరించినప్పుడు ప్రమదాలు నివారించవచ్చునన్నారు. అసిస్టెంట్ మోటరు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు అజ్మీర, బద్దు, స్వామి, వైద్యులు మౌనిక, యలమర్తి రవీంద్రకుమార్, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణా సమాచారం ఇవ్వండి

ఏలూరు క్రైం, జనవరి 30: గంజాయి, లిక్కర్ వంటి నిషేధిత వస్తువులు భారీగా ఆటోలో తీసుకుని రైలులో ప్రయాణించేందుకు ప్రయత్నించే వారి సమాచారం ఇవ్వాలని రైల్వే ఎస్ఐ డి.నరసింహారావు ఆటోడ్రైవర్లను కోరారు. రైలు ప్రయాణికుల బ్యాగులు, సెల్‌ఫోన్లు, విలువైన వస్తువులు దొంగిలించే వారి సమాచారం అందించాలన్నారు. రైల్వే ప్రయాణికులతో గౌరవంగా మెలగాలని, ప్రతి డ్రైవర్ వద్ద లైసెన్సు, ఇన్సూరెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఉండాలని అన్నారు.



కాంగ్రెస్ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటం వద్ద నేతల నివాళి



చింతలపూడిలో ఆర్యవైశ్య నాయకుల నివాళి



లింగపాలెంలో వాసవి క్లబ్ ప్రతినిధులు నివాళి



టి.నరసాపురంలో గాంధీజీ విగ్రహానికి పూలమాల

గాంధీజీ అహింసా మార్గం

అనుసరణీయం

వర్ధంతి కార్యక్రమాల్లో పలువురి నివాళి

ఏలూరు కార్పొరేషన్, జనవరి 30: మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా జిల్లాలో మంగళవారం జరిగిన కార్యక్రమాలలో పలువురు నివాళులర్పించారు. సత్యాగ్రహమే ఆయుధంగా అహింసా మార్గంలో స్వేచ్ఛ, స్వాతంత్ర్యం సాధించిన గాంధీజీ మార్గంలో పయనించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్‌రావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గౌడ రంగబాబు, దండుబోయిన చంద్రశేఖర్, నల్లగట్ల అనిల్, పచ్చమళ్ళ రాజేష్, కేఎస్ఎన్. మూర్తి, డి.శివసుబ్బారావు, సత్యనారాయణ, ఎస్.బాబు ప్రసాద్, ఎం.రవీంద్రనాథ్, కోసూరి చంద్రకాంతమ్మ పాల్గొన్నారు. జనసేన కార్యాలయంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేశారు. నగిరెడ్డి కాశీనరేష్, ఒబిలిశెట్టి శ్రావణకుమార్ గుప్త, సరిది రాజేష్, వీరంకి పండు, రెడ్డి గౌరీశంకర్, బోండా రామునాయుడు, బొత్స మధు, ఎట్రించి ధర్మేంద్ర, కందుకూరి ఈశ్వరరావు పాల్గొన్నారు.

● చింతలపూడి: పట్టణ ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య మహిళా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి వజ్రపు శేఖర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఏరియా ఆసుపత్రి వద్ద, పాత బస్టాండ్‌లో రైతుబజారు వద్ద గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేశారు. జల్లిపల్లి శివాజి, కె.ప్రసాద్, కె.శ్రీనివాసరావు, కె.రామకృష్ణ, జె.హరిప్రసాద్, కె.రాజ్యలక్ష్మి, కె.స్రవంతి పాల్గొన్నారు. కాంగ్రెస్ కార్యాలయం వద్ద విస్సంపల్లి సుందరరావు గాంధీ విగ్రహానికి పూలమాల వేశారు. శంకు ప్రసాద్, కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

● లింగపాలెం: గ్రామాల్లో సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ధర్మాజీగూడెంలో వాసవి, వనితా క్లబ్ సభ్యులు మహత్మగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి సోమిశెట్టి గంగాధర్‌రావు, కందుల రత్నమాల, ప్రకాశరావు, మన్యం పుల్లేశ్వరరావు, పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

● కామవరపుకోట: చేతనా సెంటర్‌లోని మహాత్మాగాంధీ విగ్రహానికి ఆర్యవైశ్య నాయకులు వందనపు మురళి, కొండూరి శ్రీధర్, బచ్చు ముత్యాలరావు, వంకదార ఉదయ్, వాసా విశ్వనాథం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆడమిల్లి, తడికలపూడి, కళ్ళచెరువు, జీలకర్రగూడెం, గుంటుపల్లి, రామన్నపాలెం, రావికంపాడు, తూర్పుయడవల్లి తదితర గ్రామాల్లో గాంధీజీ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాతూరులో మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● ఉంగుటూరు: మండలంలో మహాత్మా గాంధీ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు రెడ్డి సూర్యచంద్రరావు, పాతూరి విజయకుమార్, ఆర్యవైశ్య నాయకుడు ఈశ్వరరావు, బాలాజి, సప్పా సర్వేశ్వరరావు, దొడ్డపనేని బాలాజి, మరపట్ల వీర్రాజు పాల్గొన్నారు.

● టి.నరసాపురం: ఆర్యవైశ్య సంఘం, వాసవీక్లబ్ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ వర్ధంతి నిర్వహించారు. శాంతి అహింసా మార్గంలో దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన మహా వ్యక్తి గాంధీజీ అన్నారు. మాదంశెట్టి మల్లికార్జునరావు, అద్దంకి రవి, అద్దంకి రామకృష్ణ, మండం ఆదిత్య కుమార్, నల్లూరి శ్రీనివాస్, పసుమర్తి రాము, పరిమి నాగేశ్వరరావు, కొనకల్ల శ్రీనివాస్, అద్దంకి జగ్గారావు, జూలూరి నగేష్, తదితరులు పాల్గొన్నారు.



డీఆర్వోకు వినతిపత్రాన్ని అందజేస్తున్న బీటీఏ నాయకులు

నిరసన హోరు

ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మికుల ఆందోళన



ఆర్టీసీ గ్యారేజ్ వద్ద కార్మికులు, నాయకుల నినాదాలు

ఉద్యోగ, ఉపాధ్యాయులకు అన్యాయం

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 30: ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తీవ్ర అన్యాయంచేసారని బహుజన టీచర్స్ అసోసియేషన్(బీటీఏ)రాష్ట్ర అధ్యక్షుడు బి.మనోజ్‌కుమార్ ఆరోపించారు. అపరిష్కృతం సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, డీఈవో కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ అవధానిలకు మంగళవారం వేర్వేరుగా వినతిపత్రాలను అందజేశారు. ఉద్యోగులు దాచుకున్న సొమ్ము ఇవ్వకుండా ఆ నిధులను ప్రభుత్వం ఏంచేసిందో సమాధానం చెప్పాలన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు డీఎస్సీ-2003 టీచర్లకు పాతపెన్షన్‌ను వర్తింపజేయాలని కోరారు. అన్ని హైస్కూళ్లలో అంబేడ్కర్, సావిత్రి బాయి పూలే విగ్రహాలను ప్రభుత్వమే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. టీచర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించనిపక్షంలో ఫిబ్రవరి 5న విజయవాడ ధర్నా చౌక్‌వద్ద రాష్ట్రస్థాయి ధర్నా చేపడతామని వినతిపత్రాల్లో పేర్కొన్నారు. సంఘ నేతలు పి.సాల్మన్‌రాజు, బి.రామారావు, జి.వెంకటేశ్వరరావు, సాయిరాజు, గిరిబాబు, ధనకాంత, కృపాకరన్, శ్రీనివాస్, జేసుదాసు, రఘు, సౌందర్యం, రాజు, కవిత, విమల, రామదాసు తదితరులు పాల్గొన్నారు.

ఏడో రోజు సెర్ప్ ఉద్యోగుల సమ్మె

ఏలూరు కలెక్టరేట్: సెర్ప్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన సమ్మె మంగళవారం 7వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సెర్ప్ ఉద్యోగులు అందర్ని రెగ్యులర్ చేయాలని, తెలంగాణ మాదిరిగా పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఆర్టీసీ కార్మికుల ఆందోళన

ఏలూరు రూరల్: విశాఖలో ఆర్టీసీ యాజమాన్యం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా మంగళవారం రెండో రోజు ఏలూరు ఆర్టీసీ గ్యారేజ్ వద్ద ఎన్ఎంయూఏ నాయకులు ఎర్రబ్యాడ్జీలు ధరించి ఆందోళన నిర్వహించారు. విశాఖ డిపో డీపీటీవోపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డిపో అధ్యక్ష కార్యదర్శులు పీవీఎస్ఎన్.ప్రసాద్, పువ్వుల శ్రీనివాసరావు, డిపో ఉపాధ్యక్షుడు కేఆర్‌కె.రావ్ మాట్లాడుతూ యాజమాన్యం ఇష్టానుసారం డ్యూటీలు వేయడం సమంజసం కాదన్నారు. డ్రైవర్లపై కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

సాగుపై అవగాహనతో మరింత విజ్ఞానం



మాట్లాడుతున్న భరతలక్ష్మి

పెదవేగి, జనవరి 30: వ్యవసాయ విద్యార్థులకు సాగుపై అవగాహన ఉండాలని, అప్పుడే విజ్ఞానం పెరుగుతుందని మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానం అసోసియేట్ డైరెక్టర్ ఎం.భరతలక్ష్మి అన్నారు. మార్కాపురం వ్యవసాయ విద్యార్థులు పాల్గొన్న రైతు సదస్సులో భరతలక్ష్మి మాట్లాడారు. ఎరువులు, పురుగుమందుల యాజ మాన్య విధానాలను క్షేత్రస్థాయిలో రైతుల ద్వారా తెలుసుకోవడం వ్యవ సాయ విద్యార్థులకు ఎంతో అవసరం అన్నారు. మార్కాపురం ఎస్ఎస్ వ్యవసాయ విశ్వవిద్యాలయం అసోసియేట్ డీన్ ఆర్‌వీఎస్‌కే.రెడ్డి, ఏలూరు ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ సుజాత, శాస్త్రవేత్త నాగేంద్రబాబు, పెదవేగి ఏవో ఎం.ప్రియాంక, రైతులు పాల్గొన్నారు.

పొగాకు తోటలు పరిశీలించిన అధికారుల బృందం



పొగాకు తోటలను పరిశీలిస్తున్న అధికారులు

జంగారెడ్డిగూడెం, జనవరి 30: తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న వర్జీనియా పొగాకు పంటలను మంగళవారం అధికారుల బృందం పరిశీలించింది. జంగారెడ్డిగూడెం-1, 2 పొగాకు బోర్డుల పరిధిలోని మార్కెండేయపురం, ముప్పినవారిగూడెం, కోటనాగవరం, దొరమామిడి, అశ్వారావుపేట, జీలుగుమిల్లి, మక్కినవారిగూడెం తదితర గ్రామాల్లో బోర్డు అధికారులు, సీటీఆర్ఐ శాస్త్రవేత్తలు, వివిధ కంపెనీల ప్రతినిధులు రైతులకు పలు సూచనలు ఇచ్చారు. బోర్డు ఆర్ఎం ఆదిశేషయ్య, సీటీఆర్ఐ శాస్త్రవేత్త రమేష్, జంగారెడ్డిగూడెం-1 వేలం అధికారి బి.శ్రీహరి, పొగాకు బోర్డు ప్రాంతీయ అధికారి ఎం.శేషయ్య, కంపెనీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు జిల్లాలో 17 మంది ఎస్ఐల నియామకం

ఏలూరు క్రైం, జనవరి 30: సొంత జిల్లా, ఒకే జిల్లాలో మూడేళ్ల పాటు పనిచేసిన ఎస్ఐలను వేరే జిల్లాలకు బదిలీ చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు ఇచ్చింది. దీంతో ఏలూరు రేంజ్ పరిధిలోని కృష్ణ, తూర్పు గోదావరి జిల్లాల నుంచి బదిలీపై వచ్చిన 17 మంది ఎస్ఐ లకు ఏలూరు జిల్లాలో పోస్టింగ్ ఇస్తూ ఐజీ జీవీజీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లా ఎస్పీ డి .మేరీ ప్రశాంతి మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఏలూరు సీసీఎస్ ఎస్సైలుగా బిఈ.వెంకటేశ్వరరావు, కె.శేషారెడ్డి, జీవీ.ప్రసాదరావు, వి.ప్రసాద్ రాజును నియమించారు. ఏలూరు ట్రాఫిక్ ఎస్ఐగా పీఎస్.ప్రకాశరావు, జంగారెడ్డిగూడెం ట్రాఫిక్ ఎస్ఐగా జే.రంగయ్య, ఏలూరు డీసీఆర్‌బి ఎస్సైలుగా కేవీడీ.మల్లేశ్వరి, వేపూరి జాస్మిన్, పెదవేగి ఎస్సైగా వి.రాజేంద్రప్రసాద్, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఎస్సైగా టి.వెంకటరమణ, కైకలూరు టౌన్ 1 ఎస్సైగా ఎంఆర్‌కే .రాజు, నూజివీడు టౌన్ ఎస్సై 1గా కెఎస్ఎన్.మూర్తిని నియమించారు. ఏలూరు దిశ ఎస్సైలుగా కే.ప్రమీల, బి.నాగమణి, ఏలూరు త్రీ టౌన్ ఎస్సైగా గుణ్ణం ఫణిందర్, ఏలూరు టూ టౌన్ 2 ఎస్ఐగా బి. రవితేజ, వన్ టౌన్ 2ఎస్సైగా పి.నవీన్ కుమార్‌ను నియమించారు.

వైద్య ఉద్యోగుల సంఘం కేలండర్ ఆవిష్కరణ



కేలండర్ ఆవిష్కరిస్తున్న జిల్లా వైద్యాధికారి

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 30: జాతీయ ఆరోగ్య కార్యక్రమాల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు సిబ్బంది అంకిత భావంతో పనిచేయాలని జిల్లా వైద్యాధికారి శర్మిష్ఠ సూచించారు. ఏపీ ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం- 3194 జిల్లా శాఖ ముద్రించిన వార్షిక కేలండర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను సంఘ నాయకులు ఆమె దృష్టికి తీసుకెళ్ళారు. క్షేత్రస్థాయిలో ఏఎన్ఎంలు రోజూ 25కుపైగా యాప్‌లలో సమాచారాన్ని నమోదు చేయడానికే ఉద్యోగ సమయం సరిపోతుందన్నారు. అర్బన్ ప్రాంతాల్లో ఏఎన్ఎంలు ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, కులగణన సర్వే విధులతో రాత్రి 9గంటలవరకు పనిచేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని వివరించారు. ప్రభుత్వానికి నివేదిస్తానని ఆమె హామీ ఇచ్చారు. సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నల్లా అప్పారావు, జె.గోవిందరావు, రవీంద్రకుమార్, కృష్ణారావు, ప్రభాకర్‌రావు, శిరీష, విజయవర్ధన్‌బాబు, నాగరాజు, కృష్ణ, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో జేసీ లావణ్యవేణి ప్రత్యేక పూజలు



రామాలయాన్ని దర్శించిన జేసీ

లింగపాలెం, జనవరి 30: ముడిచర్ల రామాలయాన్ని జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి మంగళవారం సందర్శించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తుల ఆహ్వానం మేరకు ఆలయానికి గ్రామానికి వచ్చారు. రామ, సీత, ఆంజనేయ, లక్ష్మణ విగ్రహాలకు వెండి కిరీటాలు తొడిగారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు జాయింట్ కలెక్టర్‌ను సన్మానించారు. కార్యక్రమానికి సర్పంచ్ రావి రమాదేవి కొండలు, ఆలయ కమిటీ సభ్యులు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్ఎంలకు గ్రేడ్ -2 ఉత్తర్వులను అమలు చేయాలి

పెదవేగి, జనవరి 30: ఏఎన్ఎంలను గ్రేడ్ -3 నుంచి గ్రేడ్ -2గా చేస్తూ జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులు అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఏఎన్ఎంలు ఎంపీడీవోకు వినతిపత్రం అందించారు. మండలంలోని గ్రేడ్ -3 ఏఎన్ఎంలు పెదవేగి ఎంపీడీవోను మంగళవారం కలసి జీవో అమలు జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్ మాట్లాడుతూ ఉన్నతాధికారులకు పంపించి అమలుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఓటీఎస్ టెక్నాలజీతో డిగ్రీ కళాశాల ఒప్పందం

ఉంగుటూరు, జనవరి 30: నారాయణపురం శ్రీ అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఓటీఎస్ టెక్నాలజీ సంస్థ(ఏలూరు)తో మంగళవారం నాడు అవగాహన ఒప్పందం చేసుకుంది. ఇంటర్న్‌షిప్, ఉద్యోగావకాశాలు నైపుణ్యంతో పాటు వివిధ అంశాలపై ప్రిన్సిపాల్ టి.కే.విశ్వేశ్వరరావు, ఓటీఎస్ టెక్నాలజీ సీఈవో జి.హరిబాబు ఒప్పందంపై సంతకాలు చేశారు.

ఫెడరల్ బ్యాంక్ ఏలూరు శాఖ ప్రారంభం



బ్యాంకు బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న రామకృష్ణ

ఏలూరు రూరల్, జనవరి 30: నగరంలో నూతనంగా ఏర్పాటుచేసిన ఫెడరల్ బ్యాంకును మంగళవారం నాగహనుమాన్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ నూకల రామకృష్ణ ప్రారంభించారు. విజయవాడ రీజనల్ హెడ్ జయశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఫెడరల్ బ్యాంక్ 33వ బ్రాంచ్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. వినియోగదారులకు మెరుగైన సేవలందిస్తున్నామని తెలిపారు. అన్ని రకాల రుణాలు తక్కువ వడ్డీకే అందజేయనున్నట్లు తెలిపారు. కార్పొరేటర్ కత్తిరి రామమోహన్‌రావు, ఏటిఎం, సేఫ్ డిపాజిట్ లాకర్‌ను ప్రారంభించారు. చార్టెడ్ అకౌంటెంట్ డీవీ సుబ్బారావు, బ్రాంచ్ మేనేజరు నిమ్మకాయల ఎస్.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వెంకయ్యనాయుడుకు పద్మవిభూషణ్‌పై హర్షం



వెంకయ్యనాయుడికి సత్కారం

ఏలూరు టూటౌన్, జనవరి 30: మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడుకు కేంద్ర ప్రభుత్వం పద్మవిభూషణ్ పురస్కారం ఇవ్వడం హర్షణీయమని రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అంబికా కృష్ణ అన్నారు. వెంకయ్య నాయుడును ఆయన స్వగృహంలో మంగళవారం కలసి సత్కరించారు.

తాత్కాలిక ఉపాధ్యాయ నియామకానికి దరఖాస్తులు

టి.నరసాపురం, జనవరి 30: తాత్కాలిక ప్రాతిపదికన గణితం బోధించే ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డిఎస్‌బి శంకరరావు మంగళవారం తెలిపారు. అప్పలరాజుగూడెం గురుకుల పాఠశాలలో 5వ తరగతి నుండి 10వ తరగతి వరకు గణితం బోధించడానికి పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో 50శాతం, బిఈడీలో 50శాతం మార్కులు అర్హత కలిగిన వారు ఫిబ్రవరి 2న సర్టిఫికెట్‌లతో పాఠశాలకు హాజరు కావాలని తెలిపారు. వివరాలకు పాఠశాల పనివేళల్లో సంప్రదించాలని ఆయన తెలిపారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు కలెక్టరేట్ :** నూజివీడు సబ్‌కలెక్టర్‌గా పనిచేసి పదోన్నతి పై నెల్లూరు జాయింట్ కలెక్టర్‌గా బదిలీ అయిన ఆదర్శ్ రాజేంద్రన్ కలెక్టర్ ప్రసన్నవెంకటేశ్‌ను కలసి పూలమొక్కను అందజేశారు.
- **ఏలూరు కల్చరల్ :** టీటీడీ కల్యాణ మండపం పునర్నిర్మాణానికి రూ.10 కోట్లు మంజూరు చేసినట్లు పాలకమండలి సభ్యులు నెరుసు నాగసత్యం యాదవ్ తెలిపారు. జేవియర్ నగర్‌లో మండపానికి రూ.10కోట్ల వ్యయంతో ప్రతిపాదనలను పాలకమండలి ఆమోదించిందని తెలిపారు.
- **ఏలూరు రూరల్ :** ఫిబ్రవరి 3న వైసీపీ ఎన్నికల సన్నాహక సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ఆళ్లనాని వైసీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యకర్తలు, గృహసారథులతో సమీక్షాసమావేశం నిర్వహించారు.
- **ఏలూరు టూటౌన్ :** యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1 నుంచి నిరుద్యోగ యువతులకు మగ్గం వర్క్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు డైరెక్టర్ కె.శశిధర్ తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి భోజన సౌకర్యం కల్పిస్తామన్నారు. ఇతర వివరాలకు 9502723561, 9948565256ను సంప్రదించాలన్నారు.
- **బుట్టాయగూడెం :** బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కొండేపాటి రామకృష్ణ అన్నారు. జైనవారిగూడెంలో పలువురు రైతులు, రైతుకూలీలు బీజేపీలో చేరారు వారికి బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కొండేపాటి రామకృష్ణ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.
- **లింగపాలెం :** ధర్మాజీగూడెంలో ఎస్సై పి.చెన్నారావు ఆధ్వర్యంలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న ముగ్గుర్ని అదుపులోకి తీసుకుని కేసునమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఏఎస్సై రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.
- లింగపాలెం సరమ్మచెరువులో ఉపాధిహామీ పనులను ఎంపీడీవో తనిఖీ చేశారు. ఉపాధిహామీ కూలీలు ప్రతిరోజూ తమకు కేటాయించిన కొలతల ప్రకారం పనిచేయాలని అన్నారు.
- **ద్వారకా తిరుమల :** జి.కొత్తపల్లి జడ్పీ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు యూటీఎఫ్ ద్వారా పదో తరగతి మోడల్ పేపర్లను టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రేగంటి రాంబాబు అందజేశారు. హెచ్ఎం లీలాకుమార్, ఉపాధ్యాయులు కట్టా శ్రీనివాసరావు పాల్గొన్నారు.
- గోపాలపురం నియోజకవర్గంలో వైసీపీని భారీ మెజారిటీతో గెలిపించాలని హోంమంత్రి, నియోజకవర్గ ఇన్‌చార్జి తానేటి వనిత అన్నారు. ద్వారకాతిరుమలలో వైసీపీ నాయకులు, కార్యకర్తలతో మంగళవారం ఆమె సమావేశాన్ని ఏర్పాటు చేశారు.
- **ఉంగుటూరు :** చేబ్రోలు పీహెచ్‌సీ పరిధిలోని గోపీనాథపట్నంలో ఫీవర్ సర్వే నిర్వహించారు. తాడేపల్లిగూడెం మలేరియా యూనిట్ ఆరోగ్య ఉప అధికారి వై.వీ.లక్ష్మణరావు ఆధ్వర్యంలో సర్వే నిర్వహించి వ్యాధుల నియంత్రణకు పలు సూచనలు ఇచ్చారు. ఎంఎల్‌హెచ్‌పి. కార్నాటి శ్రీనివాసరావు, ఆరోగ్య కార్యకర్త లక్ష్మి, ఆశాలు పాల్గొన్నారు.
- ఉంగుటూరు మండలం వెల్లమిల్లి శివారు చింతాయగూడెంలో చేబ్రోలు పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.3,100 నగదును స్వాధీనం చేసుకున్నారు.









పెదవేగి, ఏలూరు, చింతలపూడి మండలాల్లో భవిష్యత్‌కు గ్యారెంటీ ప్రచార కార్యక్రమాల్లో చింతమనేని, బడేటి చంటి, టీడీపీ నేతలు, భీమడోలులో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు

టీడీపీ పాలనలోనే

గ్రామాల అభివృద్ధి

భవిష్యత్ గ్యారెంటీ ప్రచార కార్యక్రమాల్లో నేతలు

పెదవేగి, జనవరి 30: గ్రామాభివృద్ధి తెలుగుదేశం పార్టీ పాలనలోనే జరిగిందని మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. కవ్వగుంటలో జరిగిన బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో ఇంటింటికి తిరిగి టీడీపీ ఆరు పథకాల అంశాలను ప్రభాకర్ ప్రజలను వివరించారు. గత పంచాయతీ ఎన్నికల్లో వార్డు సభ్యురాలి పోటీచేసి ఓటమి చెందిన కుంపటి జ్యోతి ప్రభాకర్‌తో మాట్లాడుతూ నాలుగున్నరేళ్లుగా గ్రామం అభివృద్ధికి ఆమడదూరంలో ఉందన్నారు. టీడీపీ పాలనలో జరిగిన అభివృద్ధి తప్ప ఆ తరువాత అభివృద్ధి చేసిన దాఖలాలు లేవన్నారు. ఈ నాలుగేళ్ల పాలనలో తాము చేసిన తప్పు తెలిసొచ్చిందని, వచ్చే ఎన్నికల్లో మీకే ఓటు వేస్తామన్నారు. ప్రభాకర్ మాట్లాడుతూ నమ్మి ఓట్లేసిన ప్రజలను జగన్‌రెడ్డి నట్టేట ముంచాడని విమర్శించారు. సుగసాని గంగాధరరావు, కొట్టే నవీన్, రాయల గణేష్, బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, మంచినేని శ్రీనివాసరావు, మాగంటి నారాయణప్రసాద్, లావేటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● దెందులూరు: మండలంలోని సానిగూడెం, అలుగులగూడెం గ్రామాల్లో మాజీ సర్పంచ్ యలమర్తి శ్రీనుబాబు, సర్పంచ్ తోట ఏసమ్మతో కలసి చింతమనేని ప్రభాకర్ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. యిప్పిలి వెంకటేశ్వరావు, పెనుబోయిన మహేష్‌యాదవ్, ఎంపీటీసీ శేషారత్నం మాట్లాడుతూ చింతమనేనిని భారీ మోజార్టీతో గెలిపించుకుందామన్నారు. మాగంటి నారాయణప్రసాద్. మోతుకూరి నాని, ఏనుగు రామకృష్ణ, షేక్ అహ్మద్ జహీర్, కోటకల గణేష్, గారపాటి కొండయ్యచౌదరి, కసూకుర్తి రామకృష్ణ పాల్గొన్నారు

మండలానికి చెందిన ఆంజనేయులు, నల్లమొల్లి శ్రీస్తురాజు, ఎడ్ల శేఖర్, బాబు, బొడ్డు బాబీ, కొండవర్తి రమేష్, వెంకటేశ్వరావు, తదితరులు చింతమనేని ఆధ్వర్యంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. వారికి చింతమనేని టీడీపీ పార్టీ కండువా కప్పి స్వాగతం పలికారు.

● ఏలూరు టూటౌన్: వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి విజయం తథ్యమని ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బడేటి చంటి ధీమా వ్యక్తం చేశారు. 28వ డివిజన్ భాగ్యనగర్ కాలనీలో ప్రజాసంకల్ప యాత్ర నిర్వహించారు. ఇంటింటికి వెళ్ళి వైసీపీ ప్రజావ్యతిరేక విధానాలు వివరించారు. టీడీపీ మినీ మేనిఫెస్టోలో సూపర్ 6 పథకాలు వివరించారు. రెడ్డి నాగరాజు, తంగిరాల అరుణ సురేష్, చంద్రశేఖర్, రామారావు, సైదులు, కృష్ణ పాల్గొన్నారు.

● చింతలపూడి: ప్రగడవరంలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ, జనసేన ఆరు గ్యారెంటీ పథకాలపై వివరిస్తూ షూరిటీ పత్రాలను అందజేశారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే మళ్ళీ చంద్రబాబు ముఖ్యమంత్రిగా రావాలని పిలుపునిచ్చారు. కొనకళ్ళ వీర్రాజు, తదితరులు పాల్గొన్నారు.

కోర్టు వ్యాఖ్యలతో జగన్ సిగ్గుపడాలి : గన్ని

భీమడోలు: సుప్రీం కోర్టు వ్యాఖ్యలకు జగన్‌రెడ్డి, వైసీపీ నాయకులు సిగ్గుపడాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు ఎద్దేవా చేశారు. ఆయన క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ ఇన్నర్ రింగ్‌రోడ్డు కేసులో చంద్రబాబుకు ముందస్తు బెయిల్ రద్దు చేయాలని ప్రభుత్వం వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేయడం జగన్‌రెడ్డి ప్రభుత్వానికి చెంపపెట్టు అన్నారు. సైకో మనస్తత్వాన్ని విడనాడాలని జగన్‌కు హితవుపలికారు.

● జంగారెడ్డిగూడెం: ఇన్నర్ రింగ్ రోడ్ కేసులో జగన్ రెడ్డి ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలిందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసరి శ్యామ్ చంద్రశేషు అన్నారు. నియోజకవర్గ మీడియా కోర్డినేటర్ చెరుకూరి శ్రీధర్ ఆధ్వర్యంలో విలేకరులతో మాట్లాడారు. అధికార గర్వంతో జగన్ రెడ్డి అండ్ కో పెట్టిన కేసులు తప్పుడివి అని సుప్రీంకోర్టు తీర్పుతో వెల్లడైందన్నారు. జగన్ ఎన్ని కుట్రలు చేసినా రాష్ట్ర ప్రజలు చంద్రబాబు వెంటే ఉన్నారన్నారు. బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి చిట్టిబోయిన రామలింగేశ్వరరావు మాట్లాడుతూ చంద్రబాబుతోనే బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. బీసీలంతా ఐక్యంగా చంద్రబాబు వెంట నడవాలన్నారు. చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడు అయితే జగన్ పాయిజన్ నిండిన నాయకుడని అభివర్ణించారు. ఈ సమావేశంలో పట్టణ ఉపాధ్యక్షుడు కొండ్రెడ్డి కిషోర్, జిల్లా మహిళ కార్యనిర్వాహక కార్యదర్శి గుల్లపూడి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు గాంధీజీ

వర్ధంతి సభలో పలువురి ఘన నివాళి



నూజివీడు పెద్ద గాంధీబొమ్మ సెంటర్లో నివాళులర్పిస్తున్న మరీదు శివరామకృష్ణ

నూజివీడు టౌన్, జనవరి 30: మహాత్మాగాంధీ 76వ వర్ధంతిని పట్టణంలో నిర్వహించారు. త్రివిధ పాఠశాలలో రైతుసంఘం నాయకులు నిమ్మగడ్డ నరసింహా, ఘంటా పాపారావు, బొప్పుడి రాంబాబు, సాంబశివరావు గాంధీజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస్ పాల్గొన్నారు. పెద్దగాంధీబొమ్మ సెంటర్లో జనసేన ఉమ్మడి కృష్ణాజిల్లా అధికార ప్రతినిధి మరీదు శివరామకృష్ణ గాంధీకి నివాళులర్పించారు. ఎం.సునీల్ కుమార్, రామిశెట్టి తేజశ్విని పాల్గొన్నారు.

● ముదినేపల్లి: స్థానిక మండల కార్యాలయం వద్ద ఎంపీడీవో పి.మల్లేశ్వరి గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ నేత కొడాలి వినోద్ ఆధ్వర్యంలో వీరమల్లు నరసింహారావు, పోసిన పాండు రంగారావు, కందేపి పద్మ మహాత్ముడికి నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు మాడుగుల పూర్ణ చంద్రరావు, వత్తుమిల్లి ప్రసాద్.. గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పించారు.

● ఆగిరిపల్లి: స్థానిక పంచాయతీలో సర్పంచ్ చవటపల్లి లక్ష్మీవిక్టర్, కార్యదర్శి, సచివాలయ సిబ్బంది గాంధీకి నివాళులర్పించి లెప్రసీడే నిర్వహించారు.

● చాట్రాయి : తుమ్మగూడెం ఉర్దూ పాఠశాలలో హెచ్ఎం వెంకట్రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు.

● ముసునూరు : రమణక్కపేట సచివాలయం వద్ద గాంధీజీ చిత్రపటానికి ఎంపీపీ కొండా దుర్గాభవాని వెంకట్రావ్, సర్పంచ్ రంగు ధనలక్ష్మీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల కార్యాలయంలో ఎంపీడీవో జి.రాణి, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ దాసరి సుధ, పీహెచ్‌సీలో వైద్యాధికారిణి షకీనా ఇవాంజలి గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గాంధీజీ కలలుకన్న గ్రామస్వరాజ్య సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వక్తలు పేర్కొన్నారు. ఈవోపీఆర్డీ బి.ఎ.సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ ఎమిలికుమారి, కె.సాయిరాము పాల్గొన్నారు.

● కలిదిండి : ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘ నాయకులు మాట్లాడుతూ, అహింసా, శాంతి మార్గంలో స్వాతంత్ర్యం సాధించటంలో కీలక పాత్ర వహించిన గాంధీజీ చిరస్మరణీయుడని కొనియాడారు. గాంధీజీ సిద్ధాంతాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వూర శ్రీకాంత్, నీలి సుమన్, బత్తుల రఘురామ్, గొంద్రాల సుబ్బయ్య, నూకల శ్యామలరావు గుప్తా, వెలివెల ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

● మండవల్లి: సచివాలయాల్లో పలువురు గాంధీ చిత్రపటానికి నివాళులు అర్పించారు. మండవల్లిలో సర్పంచ్ మెండా ఝాన్సీ సురేష్‌బాబు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఏఎస్ఎంలు, ఆశావర్కర్లు, వాలంటీర్లు పాల్గొన్నారు.




ముదినేపల్లి, చాట్రాయిలో గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు, పాఠశాల చిన్నారులు






నూజివీడు త్రివిధ పాఠశాల, ముసునూరులో రమణక్కపేట, మండవల్లిలో గాంధీ చిత్రపటాలకు, కలిదిండిలో గాంధీజి విగ్రహానికి పలువురి నివాళులు

23 ప్రత్యేక రైళ్ల పొడిగింపు

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా సౌత్ సెంట్రల్ రైల్వే నిర్ణయం

ఏలూరు క్రైం, జనవరి 30 : సౌత్ సెంట్రల్ రైల్వే 23 ప్రత్యేక రైళ్లను ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పొడిగించింది. (08579) విశాఖపట్టణం - సికింద్రాబాద్ ప్రతి బుధవారం ఫిబ్రవరి 7నుంచి మార్చి 27 వరకు పొడిగింపు. (08580) సికింద్రాబాద్-విశాఖపట్టణం ప్రతి గురువారం ఫిబ్రవరి 8 నుంచి మార్చి 28 వరకు, (08583) విశాఖపట్టణం-తిరుపతి ప్రతి సోమవారం ఫిబ్రవరి 5 నుంచి మార్చి 25 వరకు, (08584) తిరుపతి-విశాఖపట్టణం ప్రతి మంగళవారం ఫిబ్రవరి 6 నుంచి మార్చి 26 వరకు, (08543) విశాఖ పట్టణం-ఎస్ఎంవీటీ బెంగళూరు ప్రతి ఆదివారం ఫిబ్రవరి 4 నుంచి మార్చి 31 వరకు, (08544) ఎస్ఎంవీటీ బెంగుళూ రు-విశాఖపట్టణం ప్రతి సోమవారం ఫిబ్రవరి 5 నుంచి ఏప్రిల్ 1 వరకు, (02809) భువనేశ్వర్-తిరుపతి ప్రతి శనివారం ఫిబ్రవరి 3 నుంచి మార్చి 30 వరకు, (02810) తిరుపతి-భువనేశ్వర్ ప్రతి ఆదివారం ఫిబ్రవరి 4 నుంచి మార్చి 31 వరకు, (03253) పాట్నా-సికింద్రాబాద్ ప్రతి సోమవారం, బుధవారం ఫిబ్రవరి 5 నుంచి ఏప్రిల్ 29 వరకు, (07255) హైదరాబాద్-పాట్నా ప్రతి బుధవారం ఫిబ్రవరి 7 నుంచి మే 1 వరకు, (07256) సికింద్రాబాద్ - పాట్నా ప్రతి శుక్రవారం ఫిబ్రవరి 9 నుంచి ఏప్రిల్ 26 వరకు, (03225) ధనాపూర్-సికింద్రాబాద్ ప్రతి గురువారం ఫిబ్రవరి 1 నుంచి ఏప్రిల్ 25 వరకు, (03226) సికింద్రాబాద్ -ధనాపూర్ ప్రతి ఆదివారం ఫిబ్రవరి 3 నుంచి ఏప్రిల్ 28 వరకు, (03245) ధనాపూర్-ఎస్ఎంవీటీ బెంగళూరు ప్రతి బుధవారం ఫిబ్రవరి 7 నుంచి ఏప్రిల్ 24 వరకు, (03246) ఎస్ఎంవీటీ బెంగళూరు-ధనాపూర్ ప్రతి శుక్రవారం ఫిబ్రవరి 9 నుంచి ఏప్రిల్ 26 వరకు, (03251) ధనాపూ ర్-ఎస్ఎంవీటీ బెంగళూరు ప్రతి ఆదివారం, సోమవారం ఫిబ్రవరి 4 నుంచి ఏప్రిల్ 29 వరకు, (03252) ఎస్ఎంవీటీ బెంగళూరు - ధనాపూర్ ప్రతి గురువారం, బుధవారం ఫిబ్ర వరి 6 నుంచి మే 1 వరకు, (03259) ధనాపూర్- ఎస్ఎంవీటీ బెంగళూరు ప్రతి గురు వారం ఫిబ్రవరి 6 నుంచి ఏప్రిల్ 30 వరకు, (03260) ఎస్ఎంవీటీ బెంగళూరు-ధనాపూర్ ప్రతి గురువారం ఫిబ్రవరి 8 నుంచి మే 2 వరకు, (03247) ధనాపూర్- ఎస్ఎంవీటీ బెంగళూరు ప్రతి గురువారం ఫిబ్రవరి 1 నుంచి ఏప్రిల్ 25 వరకు, (03248) ఎస్ఎంవీటీ బెంగళూరు-ధనాపూర్ ప్రతి శనివారం ఫిబ్రవరి 3 నుంచి ఏప్రిల్ 27 వరకు, (03241) ధనాపూర్-ఎస్ఎంవీటీ బెంగళూరు ప్రతి శుక్రవారం ఫిబ్రవరి 2 నుంచి ఏప్రిల్ 26 వరు, (03242) ఎస్ఎంవీటీ బెంగళూరు- ధనాపూర్ ప్రతి ఆదివారం ఫిబ్రవరి 4 నుంచి ఏప్రిల్ 28 వరకు ప్రయాణిస్తాయి.



డంపింగ్ యార్డ్ కాదు.. బైపాస్..!

» మార్జిన్ దిగితే ప్రమాదం.. వాహనదారుల గగ్గోలు

» మానవ వ్యర్థాలతో నింపేస్తున్నా పట్టించుకోని అధికారులు

నూజివీడు టౌన్, జనవరి 30: బైపాస్ రోడ్డు వ్యర్థాలతో డంపింగ్‌యార్డును తలపిస్తోంది. పట్ట ణంలో ట్రాఫిక్ ఎద్ద డిని తగ్గించేందుకు తుక్కులూరు నుంచి నూజివీడు పెద్దచెరువు కళంగివరకు దశాబ్ద కాలం క్రితం బైపాస్‌ను నిర్మించారు. రహదారి మార్జిన్‌లు డంపింగ్‌యార్డును తలపిస్తూ వ్యర్థాలతో నిండిపోతున్నాయి. ఫలితంగా ఇరువులా ఉన్న వ్యవసాయదారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చివరికి మానవ వ్యర్థాలను సైతం మార్జిన్ లోనే పోస్తుండటంతో దుర్వాసనతో పరిస్థితి మరింత దారుణంగా మారిందని వాహనదారులు గగ్గోలు పెడుతున్నారు. కొబ్బరి బొండాలు, భవన నిర్మాణ వ్యర్థాలకు సైతం తిరువూరు వైపు బైపాస్‌లో పారవేస్తుండటంతో వాహనం మార్జిన్ దిగితే ప్రమాదాలు జరిగే పరిస్థితి నెలకొందని పట్టణవాసులు వాపోతున్నారు. తక్షణం మున్సిపల్, రహదారుల శాఖ అధికారులు స్పందించి బైపాస్‌లో వ్యర్థాలు వేయకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పన్నుల వసూళ్లపై దృష్టి సారించండి



కార్యదర్శులతో సమీక్షిస్తున్న డీఎల్‌పీవో

చాట్రాయి, జనవరి 30: పంచాయతీల్లో నూరుశాతం పన్నులు వసూళ్లు చేస్తేనే అభివృద్ధి సాధ్యమని నూజివీడు డీఎల్‌పీవో ఎం.పి.యన్. సుందరి అన్నారు. మండల కార్యాలయంలో మంగళవారం కార్యదర్శులు సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, పన్నుల వసూళ్లు సక్రమంగా లేక చిన్నచిన్న పనులు పూర్తి చేయాలన్నా నిధులు లేక ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. పారిశుధ్యం, 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై సమీక్షించారు. ఈవోపీఆర్డీ మురళీకృష్ణ, నాగరాజు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలకు జగన్ స్టిక్కర్లు



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

మండవల్లి, జనవరి 30: రాష్ట్ర ప్రజలను జగన్ ప్రభుత్వం దగా చేసిందని, కేంద్ర నిధులతో అమలవుతున్న పథకాలను రాష్ట్ర పథకాలుగా మభ్యపెట్టి ప్రజ లను మోసం చేశారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోడూరు లక్ష్మీనారాయణ, ఏలూరు ఇన్‌చార్జి ఎ.పి.ఆర్. చౌదరి, జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిషోరు ధ్వజమెత్తారు. లోకుమూడిలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ వేంపాటి విష్ణురావు అధ్యక్షతన కైకలూరు నియోజకవర్గ బీజేపీ కార్యవర్గ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, వికసిత్ భారత్ సంకల్పయాత్ర గ్రామసభలు ద్వారా రాష్ట్ర ప్రభుత్వ బండారం బట్టబయలు అయిందని పేర్కొన్నారు. చౌదరి మాట్లాడుతూ, ఎన్నికల్లో విజయకేతనం ఎగురవేయడానికి సన్నద్ధులు కావాలని పిలుపునిచ్చారు. విక్రమ్ కిషోర్ మాట్లాడుతూ, ప్రజలతో మమేకమై కేంద్ర పథకాలను ఇంటింటికి తెలియజేయాలని సూచించారు. కృష్ణప్రసాద్, కోటప్రోలు కృష్ణారావు, కీర్తి వెంకటరాంప్రసాద్, సమయం ఏసుబాబు, వేంపాటి గోవిందచంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఊపిరితిత్తుల వ్యాధితో యువకుడి మృతి

చదువు మాని కుటుంబానికి ఆసరాగా కూలీగా పనిచేస్తూ..



నివాళులర్పిస్తున్న ఎంపీపీ తదితరులు

ముదినేపల్లి, జనవరి 30 : తల్లిదండ్రులకు ఆససరాగా ఉందామనుకుని చదువును సైతం పక్కనబెట్టి కూలీ పనులకు వెళుతూ అనారోగ్యానికి గురైన ఓ యువకుడు తనువు చాలించిన ఘటన మంగళవారం పెదగొన్నూరు శివారు విశ్వనాద్రిపాలెంలో జరిగింది. వివరాలివి. మంటాడ పాపారావు తన కుటుంబంతో ఏడాది క్రితం గుడివాడ ప్రాంతంలో కూలీ పనులకు వెళ్లాడు. తొమ్మిదో తరగతి చదువుతున్న అతడి కుమారుడు దావీదు (16) చదువు మధ్యలో ఆపేసి తల్లిదండ్రులతో వెళ్లిపోయాడు. కూలీ పనులకు వెళ్తూ కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. కొంతకాలం క్రితం దావీదు అనారోగ్యానికి గురికాగా, గుడివాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందాడు. ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్‌కు ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించలేక విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. వ్యాధి ముదిరిపోవటంతో సోమవారం రాత్రి మృతిచెందాడు. మృతదేహాన్ని మంగళవారం విశ్వనాద్రిపాలెం తీసుకువచ్చారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, కలిదిండి ఏఎంసీ ఛైర్మన్ బత్తిన కిషోర్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు శీలం రామకృష్ణ, కోమటి విష్ణువర్ధన్, కొడాలి వినోద్, వీరంకి చక్రపాణి, పంతగాని సురేష్ దావీదు కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు.

పోలీసుల అదుపులో ముగ్గురు పేకాటరాయుళ్లు

ముసునూరు, జనవరి 30: రమణక్కపేటలో పేకాట శిబిరంపై మంగళవారం పోలీసులు దాడి చేశారు. ముగ్గురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి రూ.900 నగదును స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వాసు తెలిపారు.

ఏలూరు జిల్లాలో 17 మంది ఎస్ఐల నియామకం

ఏలూరు క్రైం, జనవరి 30: సొంత జిల్లా, ఒకే జిల్లాలో మూడేళ్లు పాటు పనిచేసిన ఎస్ఐలను వేరే జిల్లాలకు బదిలీ చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు ఇచ్చింది. దీంతో ఏలూరు రేంజ్ పరిధిలోని కృష్ణా, తూర్పు గోదావరి జిల్లాల నుంచి బదిలీపై వచ్చిన 17 మంది ఎస్ఐలకు ఏలూరు జిల్లాలో పోస్టింగ్ ఇస్తూ ఐజీ జీవీజీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు ఎస్పీ డి.మేరీ ప్రశాంతి మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఏలూరు సీసీఎస్ ఎస్సైలుగా బి.ఈ.వెంకటేశ్వరరావు, కె.శేషారెడ్డి, జీవీ ప్రసాదరావు, పి.ప్రసాద్ రాజును నియమించారు. ట్రాఫిక్ ఎస్ఐగా వీఎస్.ప్రకాశ రావు, జంగారెడ్డిగూడెం ట్రాఫిక్ ఎస్ఐగా జే రంగయ్య, ఏలూరు డీసీఆర్‌బి ఎస్సైలుగా కేవీడీ.మల్లేశ్వరి, వేపూరి జాస్మిన్, పెదవేగి ఎస్సైగా వి.రాజేంద్రప్ర సాద్, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఎస్సైగా టి.వెంకటరమణ, కైకలూరు టౌన్-1 ఎస్సైగా ఎంఆర్‌కే.రాజు, నూజివీడు టౌన్ ఎస్సై 1గా కెఎస్ఎన్.మూర్తిని నియమించారు.

ఏలూరు దిశ ఎస్సైలుగా కే.ప్రమీల, బి.నాగమణి, ఏలూరు త్రీ టౌన్ ఎస్సైగా గుణ్ణం ఫణీందర్, ఏలూరు టూటౌన్ 2 ఎస్ఐగా బి. రవితేజ, వన్ టౌన్ 2ఎస్సైగా పి.నవీన్ కుమార్‌ను నియమించారు.



ముదినేపల్లిలో శిక్షణ ఇస్తున్న టీడీపీ సాంకేతిక ప్రతినిధులు

టీడీపీ బూత్ ఇన్‌చార్జ్‌లకు శిక్షణ

ముదినేపల్లి, జనవరి 30 : టీడీపీ మండల స్థాయి క్లస్టర్ యూనిట్, బూత్ ఇన్‌చార్జ్‌లకు మంగళవారం శిక్షణనిచ్చారు. పోల్ మేనేజ్‌మెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొడాలి వినోద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మంగళగిరి కేంద్ర కార్యాలయ సాంకేతిక ప్రతినిధులు సుభాష్, మేకా విజయ కుమార్, వాకా కళ్యాణ్ ఓటర్ల జాబితాల పరిశీలనతోపాటు బూత్ స్థాయి నుంచి బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాల నిర్వహణ, మానిఫెస్టోను ఇంటింటా విపులంగా వివరించటంతోపాటు ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంలో బూత్ కన్వీనర్లు వ్యవహరించాల్సిన తీరును వివరించారు.వీరమల్లు నరసింహారావు, పోసిన పాండురంగారావు, కందేపి పద్మ,పరసా విశ్వేశ్వరరావు, వీరంకి చక్రపాణి, జాస్తి రాజా, ఈడే సుధాకర్ పాల్గొన్నారు.

● కలిదిండి : టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు నివాసంలో టీడీపీ బూత్ ఇన్‌చార్జ్‌లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఓటర్ల తుది జాబితాలో తప్పులుంటే సరి చేసుకోవాలన్నారు. జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన వారి ఓట్లు తొలగిస్తే న్యాయ పోరాటానికి సిద్ధం కావాలన్నారు. అంద్రాజు శ్రీనివాస్, కళాధరరావు, త్రినాథ వర్మ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాన్ని మార్చండి



ఏవో తేజోమణికి వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నేతలు

ముసునూరు, జనవరి 30: చెక్కపల్లి జడ్పీ పాఠశాలలో ఉన్న 60వ పోలింగ్ కేంద్రా న్ని మార్చాలని కోరుతూ సబ్ కలెక్టర్ కార్యాలయ ఏవో తేజోమణికి టీడీపీ నాయకులు మంగళవారం వినతప త్రం అందజేశారు. కూచిపూడి దేవేంద్ర, మాదల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, ఈ పోలింగ్ కేంద్రం గతంలో ఆర్‌సీఎం స్కూల్‌లో ఉండేదని, దీన్ని గత కొన్నేళ్ల క్రితం జడ్పీపాఠశాలకు మార్చారని అన్నారు. పోలింగ్ కేంద్రానికి రావాలంటే కిలోమీటరు పైగా వెళ్లాల్సి ఉండటంతో ఓటర్లు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఆర్‌సీఎం స్కూల్ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని వారు కోరారు.

ఆసరా చెక్కుల పంపిణీ

నూజివీడు, జనవరి 30: జగన్ ప్రభుత్వం ఉన్నంత వరకే ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతాయని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. స్థానిక ఎస్.ఆర్.ఆర్ బాలుర ఉన్నతపాఠశాలలో నాల్గోవిడత జగనన్న ఆసరా పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. డ్వాక్రా మహిళలకు చెక్కులను లాంఛనంగా పంపిణీ చేశారు. పట్టణంలో 6,603 స్వయం సహాయక సంఘాలకు రూ.6కోట్ల81లక్షలు, రూరల్ మండలం పరిధిలో 1500 గ్రూపులకు చెక్కులను పంపిణీ చేశారు. ఛైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణిదుర్గ, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్‌రషీద్, ఎంపీడీవో జి.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లెప్రసీపై అవగాహన ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న వైద్యాధికారి నాగ సత్యవాణి

కలిదిండి, జనవరి 30 : లెప్రసీపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని వైద్యాధికారి నాగ సత్యవాణి అన్నారు. వెంకటాపురంలో గాంధీ వర్ధంతి సందర్భంగా లెప్రసీపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. లెప్రసీని తొలి దశలో గుర్తించి చికిత్స చేస్తే నయమవుతుందన్నారు. చర్మంపై తెల్ల మచ్చలు ఉండి స్పర్శ తెలియకపోతే లెప్రసీగా గుర్తించి వెంటనే ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉచిత వైద్య సేవలందిస్తున్నామన్నారు. గూడవల్లి శ్రీనివాసరావు, నాగమణి, సూర్యప్రకాష్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు

కలిదిండి, జనవరి 30 : గ్రామాల్లో మౌలికవసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు అన్నారు. గుర్వాయిపాలెం పంచాయతీ పరిధిలోని మద్వానిగూడెంలో ఉప్పుటేరు వద్ద రూ.3 లక్షలతో నిర్మించిన నూతన రేవును, రూ.8 లక్షలతో ఏర్పాటు చేసిన త్రీ ఫేజ్ విద్యుత్ లైన్లను మంగళవారం ప్రారంభించారు. చందన ఉమామహేశ్వరరావు, కొల్లాటి సత్యనారాయణ, బత్తిన ఉమామహేశ్వరరావు, నల్లూరి మహాలక్ష్మి పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ తాగునీరు



పైప్‌లైన్ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కైకలూరు, జనవరి 30: ప్రతి గ్రామానికి జలజీవన్ మిషన్ ద్వారా స్వచ్ఛమైన తాగునీరందిస్తామని ఎమ్మెల్యే దూలంనాగేశ్వరరావు అన్నారు. నరసాయిపాలెంలో మంగళవారం రూ.52 లక్షలు జల జీవన్ నిధులతో మంచినీటి పైపులైన్ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ప్రతీ ఇంటికి పైప్‌లైన్ ద్వారా మంచినీటిని అందిస్తామన్నారు. ఎంపీపీ అడవి కృష్ణ, కొప్పూరి రాధాకృష్ణ, ఎండీ జహీర్, బలరామరాజు పాల్గొన్నారు.

బీజేపీ పార్లమెంట్ కో కన్వీనర్‌గా కోటప్రోలు



ముదినేపల్లి, జనవరి 30 : బీజేపీ ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ కో -కన్వీనర్‌గా ముదినేపల్లికి చెందిన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి మంగళవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా ప్రచార క మిటీ కన్వీనర్, కైకలూరు నియోజకవర్గ కో-ఆర్డినేటర్‌గా కూడా వ్యవహరిస్తున్న కృష్ణారావుకు అధిష్ఠానం రెండోసారి ఈ బాధ్యతలను అప్పగించింది.

మానవహక్కుల సంఘం ఏపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సత్యప్రసాద్



ముదినేపల్లి, జనవరి 30 : నేషనల్ సోషల్ జస్టిస్, హ్యూమన్ రైట్స్ కమిషన్ ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ముదినేపల్లికి చెందిన ఆర్యవైశ్య సంఘ ప్రముఖుడు వత్తుమిల్లి వెంకట సత్యప్రసాద్ నియమిలయ్యారు. కమిషన్ జాతీయ ఛైర్మన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఉమ్మడి కృష్ణాజిల్లా వాసవీ సేవా దళ్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు.

రహదారి భద్రతపై డ్రైవర్లకు అవగాహన



మాట్లాడుతున్న ఎంవీఐ నాగమురళి

నూజివీడు టౌన్, జనవరి 30: పరిమితికిమించి ప్రయాణికులనుఎక్కించుకోవడం చట్ట విరుద్ధమని, ప్రమాదం జరిగితే బీమా వర్తించదని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ జి.నాగ మురళి అన్నారు. స్థానిక శ్రీశక్తి భవన్‌లో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని ఆటో, ఆర్టీసీ డ్రైవర్లు, ఇతర వాహన చోదకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వాహ నాలు నడిపేటప్పుడు ధ్రువపత్రాలు దగ్గర ఉంచుకోవాలన్నారు. మైనర్లు వాహ నాలు నడిపితే వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆర్టీసీ డిఎమ్ సూర్యపవన్ కుమార్, ఏలూరు జిల్లా సీఆర్వో కె.ఎల్.వి నరసింహం పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించండి

ముదినేపల్లి రూరల్, జనవరి 30: సింగరాయపాలెం నాలుగు రోడ్ల కూడలిలో వాహనాల పార్కింగ్ అడ్డదిడ్డంగా ఉండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని వాహనదారులు గగ్గోలు పెడుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే ట్రాఫిక్ కానిస్టేబుల్ ఉంటున్నారని, మిగిలిన సమయాల్లో సిబ్బంది లేకపోవడంతో ఆటో డ్రైవర్లు.. ప్రయాణికుల కోసం రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిపి ఉంచడంతో భారీ వాహనాలు మలుపు తిరిగేటప్పుడు ట్రాఫిక్‌కు అంతరాయం కారణంగా నిలిచిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాఫిక్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులతో పాటు వాహనదారులు కోరుతున్నారు.

తమ భూములు ఆక్రమించి తవ్వేస్తున్నారు..

» కలెక్టర్‌కు దళితుల ఫిర్యాదు

ముదినేపల్లి రూరల్, జనవరి 30: వైవాకలో తమకు పంపిణీ చేసిన 194 ఎకరాల్లో కొంతమంది అధికార పార్టీ నేతలు తమమధ్య విభేదాలు తీసుకువచ్చి భూములను ఆక్రమించి చెరువులు తొవ్వేస్తున్నారని ఆరోపిస్తూ జిల్లా కలెక్టర్ స్పందనలో దళితులు ఫిర్యాదు చేశారు. అధికారపార్టీకి చెందిన పైడిపాటి వెంకటరమణ సోదరులు తమను బెదిరించి తమ అనుమతి లేకుండానే కొల్లేటికి చెందిన జయరాజుకు అధిక లీజుకు తమ భూములు ఇచ్చి తమకు మాత్రం రూ.21,000 ఇస్తామంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ భూములు తమకు అప్పగించాలని, మరో లీజు దారుడికి ఇచ్చుకునే విధంగా సహకరించాలని కలెక్టర్‌కు విన్నవించారు. అధికారపార్టీ అండదండలతో తమపై దాడి చేస్తారన్న భయం వెంటాడుతోందని వాపోయారు.

సత్తుపల్లి నుంచి చాట్రాయి మీదుగా విజయవాడకు బస్సు

చాట్రాయి, జనవరి 30: తెలంగాణ రాష్ట్రం సత్తుపల్లి నుంచి చాట్రాయి మీదుగా విజయవాడకు బుధవారం నుండి కొత్త బస్ సర్వీస్ నడుపుతున్నట్లు టీఎస్ ఆర్టీసీ అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ బస్సు ప్రతిరోజు ఉదయం ఆరు గంటలకు సత్తుపల్లిలో బయలుదేరి బేతుపల్లి, తుంబూరు, దుద్దేపూడి, మల్లేశ్వరం, శివపురం, చాట్రాయి మండలం చిన్నంపేట, పర్వతాపురం, నరసాపురం, విస్సన్నపేట మీదుగా విజయవాడ వెళుతుందని అన్నారు. తిరిగి సాయంత్రం ఐదు గంటలకు విజయవాడలో బయలుదేరి ఇదే రూట్‌లో సత్తుపల్లి వెళుతుందని, ఆయా గ్రామాల ప్రజలు బస్సు సర్వీసును సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి



మాట్లాడుతున్న రఘునాథరెడ్డి

కైకలూరు, జనవరి 30: పర్యావరణ సంరక్షణకు పరిశోధనలు చేయవలసిన ఆవశ్యకత ఎంతైన ఉందని కృష్ణా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జి. జ్ఞానమణి అన్నారు. స్థానిక వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో రీసెర్చ్ మెథడాలజీ ఇన్ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌పై అంతర్జాతీయ సమినార్‌ను మంగళవారం ఆన్‌లైన్ ద్వారా నిర్వహించారు. సెమినార్‌కు ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రఘునాథరెడ్డి అధ్యక్షత వహించారు. వక్తలు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రజలందరి కర్తవ్యమన్నారు. డాక్టర్ పద్మ దోరాటి, వైస్ ప్రిన్సిపాల్ డి. ఉదయప్రకాష్, ఐక్యూ కోఆర్డినేటర్ జాలబాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ సంధ్య, కె.ఇమ్మానియేలు, పి. పాల్‌దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన జేసీ ఆదర్ష్ రాజేంద్రన్



పూలమొక్క అందజేస్తున్న ఆదర్ష్ రాజేంద్రన్

ఏలూరు కలెక్టరేట్, జనవరి 30: నూజివీడు సబ్ కలెక్టర్‌గా పనిచేస్తూ పదోన్నతిపై నెల్లూరు జాయింట్ కలెక్టర్‌గా నియమిం చబడిన ఆదర్ష్ రాజేంద్రన్ మంగళవారం కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజే శారు. సబ్‌కలెక్టర్‌గా సేవలు అందించి పలువురు మన్ననలు పొందిన ఆదర్ష్ రాజేంద్రన్ సమర్థవంతమైన అధికారిగా పేరు తెచ్చుకున్నారు.

భీమవరం నుంచే బీజేపీ ఎన్నికల శంఖారావం

» పార్టీ రాష్ట్ర కార్యదర్శి భూపతిరాజు శ్రీనివాసవర్మ



మాట్లాడుతున్న బీజేపీ నేత శ్రీనివాసవర్మ

భీమవరం, జనవరి 30 : రాబోయే ఎన్నికలకు భీమవరం నుంచే బీజేపీ ఎన్నికల శంఖారావాన్ని ప్రారంభిస్తుందని పార్టీ రాష్ట్ర కార్యదర్శి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. భీమవరంలో వచ్చేనెల ఒకటిన రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి చేతుల మీదుగా నరసాపురం పార్లమెంట్ బీజేపీ ఎన్నికల కార్యాలయాన్ని ప్రారం భిస్తున్నామన్నారు. మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఇక్కడి నుంచే రాష్ట్రంలోని 13 జిల్లాల్లో ఎన్నికల కార్యాలయాలను వర్చువల్‌గా ఆమె ప్రారంభిస్తారన్నారు. నూరుశాతం పోలింగ్ బూత్ కమిటీలను ఏర్పాటు చేసి ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామన్నారు. పొత్తుల వ్యవహారం అలా ఉంచితే ఇక్కడ నరసాపురం పార్లమెంట్‌లో బీజేపీ పోటీ చేస్తుందని, తానే అభ్యర్థిగా ఉంటానన్నారు. 2009లో ఒకసారి పోటీ చేశానని, ఇప్పుడు పోటీలో ఉన్నానన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటినీ ప్రజలకు వివరిస్తామన్నారు. జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలన్నీ ప్రజలకు చేరువయ్యా యన్నారు. అనంతరం లోక్‌సభ పార్టీ కన్వీనర్‌గా నియమితులైన పేరిచర్లసుభాష్‌రాజును అభినందించారు. పట్టణ అధ్యక్షుడు కాయిత సురేంద్ర, మీడియా సెల్ కన్వీనర్ అడబాల శివ తదితరులు పాల్గొన్నారు.

ముద్దరబోయినకే టికెట్టు ఇవ్వాలి

» అధిష్టానానికి టీడీపీ నేతల వినతి



మాట్లాడుతున్న నేతలు

చాట్రాయి, జనవరి 30: పదేళ్లుగా పార్టీ బలోపేతానికి అలుపెరగకుండా కృషి చేస్తున్న ముద్దరబోయినకే నూజివీడు టికెట్టు ఇవ్వాలని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పలగాని దుర్గారావు, దళిత నేత నక్క రాము, అంబటి చంటి తదితరులు అధిష్టానవర్గానికి విజ్ఞప్తి చేశారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ, నూజివీడు ఇన్‌చార్జిగా 24 గంటలు పార్టీకి అంకితమై , గెలుపు ఓటములతో సంబంధం లేకుండా కేడర్‌కు అండగా ఉంటూ పార్టీ శ్రేయస్సే పరమావధిగా ముద్దరబోయిన పని చేస్తున్నారని అన్నారు. కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్న నాయకుడికి టికెట్టు ఇచ్చి న్యాయం చేయాల న్నారు. టికెట్టు ఇస్తే అత్యధిక మెజారిటీతో గెలిపిస్తామని అన్నారు. రాయవరపు పుల్లారావు, శ్రీరాముల సత్యం, కమ్ముల కొండలరావు, చిన్న సాంబశివరావు, బ్రహ్మయ్య, కిరణ్‌బాబు, అర్జునరావు పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్లకు 22 మంది ఎంపిక



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న జ్యోతి

చాట్రాయి, జనవరి 30: శ్రీసత్య సాయి సేవా ట్రస్ట్-విస్సన్నపేట, అమెరికన్ హాస్పటల్- నూజివీడు సంయుక్తాధ్వర్యంలో చనుబండలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరంలో 22 మందిని ఉచిత కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. కంటి వైద్య నిపుణుడు జెమ్సుద్ షాహిన్ 61 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. తొలుత వైద్య శిబిరాన్ని సర్పంచ్ జ్యోతి ప్రారంభించారు. ఎం.నాగేశ్వరరావు, సోనీ ఆనంద్, శ్యామ్‌ప్రసాద్, రంగారెడ్డి, రామశేషు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపి



వైద్యసేవలు చేస్తున్న డాక్టర్ ప్రశాంతి

ముసునూరు, జనవరి 30: రమణక్కపేట మెయిన్ పాఠశాలలో ఏర్పాటుచేసిన భవిత సెంటర్‌లో మంగళవారం దివ్యాంగులకు ఉచిత ఫిజియోథెరపి శిబిరాన్ని ఏర్పాటు చేశారు. డాక్టర్ ప్రశాంతి పదిమంది దివ్యాంగ చిన్నారులకు ఫిజియోథెరపి చికిత్స అందించి, తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఐఈఆర్టీలు డి.ఎం.వి.ఎల్ నారాయణరావు, జె.నాగమల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.